

ప్రత్యేక అలంకరణలో రంగనాథ స్వామి

భక్తుల కొంగుబంగారం

బొలికొండ రంగనాథుడు

- రేపట్నుంచి బ్రహ్మోత్సవాలు
- 12న కల్యాణోత్సవం, బ్రహ్మరథోత్సవం



ఆలయ గాలి గోపురం

గుత్తి రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వెలుగొందుతున్న బొలికొండ రంగనాథ స్వామి ఉత్సవాలు ఈనెల 6న ప్రారంభం కానున్నాయి. గుత్తి మండలం తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహోత్సవాలు ఏటా మాఘ శుద్ధ సప్తమి నుంచి పౌర్ణమి వరకు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. 12వ తేదీ తెల్లవారుజామున కల్యాణోత్సవం ఉంటుంది. అదేరోజు సాయంత్రం స్వామివారి బ్రహ్మ రథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణాన్ని తిలకించేందుకు రాయలసీమ జిల్లాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివస్తారు. ఉత్సవ విగ్రహాలను రథంపై ఉంచి జమ్మిచెట్టు వరకూ ఊరేగిస్తారు. రథాన్ని లాగితే పాప విముక్తి కలుగుతుందనీ, కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల విశ్వాసం. ఈ ఉత్సవాలకు లక్షకుపైగా భక్తులు హాజరవుతారు.

శతాబ్దాల చరిత్ర

గుత్తి మండలంలోని తొండపాడు బొలికొండ రంగనాథస్వామి ఆలయానికి శతాబ్దాల చరిత్ర ఉంది. రాయలకాలంలో ఆలయాన్ని నిర్మించారు. ఆనాటి కట్టడం నేటికీ చెక్కు చెదరలేదు. 300 అడుగుల ఎత్తులోని కొండ అగ్రభాగాన గుహలో స్వామివారు స్వయం ఉద్భవ శిలగా అవతరించారు. గ్రామంలో 63వ జాతీయ రహదారి పక్కన కొండ ఎదురుగా స్వామివారి మూలవిరాట్‌ను కొలువుదీర్చడంతో ఈ కొండను బొలికొండగా పిలుస్తారు. అందుకే బొలికొండ రంగనాథస్వామిగా ప్రసిద్ధికెక్కారు. కొండపైకి భక్తులు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతుండడంతో మూలవిరాట్టుకు ప్రతిరూపంగా స్వామివారి విగ్రహాన్ని కొండ దిగువన ఆలయంలో ప్రతిష్ఠించారు. 1969 నుంచి దేవదాయ శాఖ ఆధ్వర్యంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ కొండపైన ఉన్న స్వయంభు శిలకు ప్రతి శనివారం పూజలు చేస్తారు. అకాశదీపం వెలిగిస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పౌర్ణమిరోజున ఉదయం నుంచి భక్తులు ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు, ఆటోలను గుడి చుట్టూ తిప్పుతుంటారు.

వారం రోజులపాటు ఉత్సవాలు

బొలికొండ రంగనాథ స్వామి బ్రహోత్సవాలు వారంరోజులపాటు నిర్వహించనున్నారు. ఇందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు. 6న ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులను జక్కలచెరువు గ్రామం నుంచి తొండపాడులోని ఆలయానికి తీసుకొస్తారు. స్వామివారిని పెళ్లి కుమారుడిగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించి, పల్లకీలో తీసుకొస్తారు. గురువారం రాత్రి 10 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పణతో స్వామివారి బ్రహోత్సవాలు ప్రారంభమవుతాయి. 7న సింహ వాహనోత్సవం, 8న శేషవాహనం, 9న హనుమత్‌వాహనం, 10న గరుడ వాహనం, 11న గజవాహనంపై స్వామివారు విహరిస్తారు. 12న తెల్లవారుజామున స్వామివారి కల్యాణోత్సవం, సాయంత్రం రథోత్సవం 13న పార్వేట, అశ్వవాహనం, 14న వసంతోత్సవం, హంసవాహనోత్సవం, సాయంత్రం ఊంజలసేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

నెట్టికంటి ఆలయంలో రథసప్తమి



గరుడ వాహనంపై స్వామివారు

గుంతకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం ఉదయం స్వామి గరుడ వాహన వేంచేపును నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో గరుడ వాహనంపై సీతారామ లక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను కూర్చోబెట్టి పుష్పాలంకారాలు చేశారు. ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి, సూర్య యంత్ర ఆరాధన, పాల పొంగళ్లు, సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ప్రధానార్చకులు గరుడాచార్యులు, రాఘవాచార్యులు, సూపరింటెండెంట్ పి. వెంకటేశులు, కౌన్సిలర్ జి.ఆంజనేయులు పాల్గొన్నారు.

రోజూ 500 లీటర్ల ఉత్పత్తి

- ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం
- రెడ్డిపల్లి జైలులో తయారీ
- రాష్ట్రంలోని జైళ్లకు సరఫరా
- మిగిలినది స్థానికంగా విక్రయం



జిల్లా జైలు వంట నూనె పరిశ్రమలో పనిచేస్తున్న ఖైదీలు



రెడ్డిపల్లి జిల్లా జైలు

ఖైదీల కష్టం.. నూనె స్వచ్ఛం..!

"ఒక కిలో వేరుశనగ విత్తనాలు రూ. 110 నుంచి 120 వరకు మార్కెట్లో దొరుకుతున్నాయి. ఒక లీటరు వేరుశనగ నూనె ఉత్పత్తి కావాలంటే సుమారు రెండున్నర నుంచి మూడు కిలోల వేరుశనగ విత్తనాలు అవసరమవుతాయి. మరి బయట మార్కెట్‌లో వేరుశనగ నూనె రూ. 150 నుంచి 160కే ఎలా లభిస్తోంది..? కల్తీ ఉన్నట్లే కదా..! కానీ.. రెడ్డిపల్లి వద్ద ఉన్న జిల్లా జైలులో ఖైదీలు స్వచ్ఛమైన వేరుశనగ నూనె తయారు చేస్తున్నారు. లీటరు నూనె తయారీకి 2.7 కిలోల వేరుశనగ విత్తనాలను ఉపయోగిస్తున్నారు. కిలో రూ.279 చొప్పున విక్రయిస్తున్నారు."



విక్రయించడానికి సిద్ధంగా ఉన్న నూనె క్యాన్లు

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంట సాగులో అనంతపురం జిల్లా దేశంలోనే పేరుగాంచింది. ఇక్కడ పండిన వేరుశనగ కాయలతో కల్తీలేని స్వచ్ఛమైన నూనె తయారు చేస్తూ ప్రత్యేకతను చాటుతోంది అనంతపురం జిల్లా జైళ్లశాఖ. రెడ్డిపల్లి వద్ద ఉన్న జిల్లా జైలులో 2016లో వేరుశనగ వంట నూనె తయారీ పరిశ్రమను ఏర్పాటు చేశారు. పనిచేసే కార్మికులందరూ ఖైదీలే. వారే ఈ పరిశ్రమను విజయవంతంగా నడుపుతున్నారు. ఇక్కడ తయారు చేస్తున్న వంట నూనెకు 'సుధార్' అనే పేరు పెట్టారు. ప్రస్తుతం కల్తీ నూనెలతో జనం రోగాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో కల్తీలేని వంట నూనెను ఇక్కడ ఖైదీలు తయారు చేస్తున్నారు. ఈ నూనె రాష్ట్రంలో ఉన్న సెంట్రల్, సబ్‌జైళ్లకు పంపిస్తున్నారు. మిగిలినది స్థానిక జైలు వద్ద విక్రయిస్తున్నారు.

రోజుకు 500 లీటర్ల ఉత్పత్తి

జిల్లా జైలులో ఏర్పాటు చేసిన వంట నూనె పరిశ్రమలో ఖైదీలు శ్రమించి రోజుకు 500 లీటర్ల వరకు ఉత్పత్తి చేస్తున్నారు. నూనె ఉత్పత్తికి అవసరమయ్యే వేరుశనగ విత్తనాలను టెండర్ల ద్వారా వ్యాపారుల నుంచి జైలు అధికారులు కొనుగోలు చేస్తారు. నూనె తయారీ ప్లాంటులో రోజూ 8 మంది ఖైదీలు 8 గంటల పాటు పనిచేస్తారు. ఇక్కడ ఉత్పత్తి అయిన వంట నూనె రాజమండ్రి, విశాఖపట్నం, కడప, అనంతపురం, నెల్లూరు సెంట్రల్ జైళ్లతో పాటు అన్ని జిల్లాల్లో ఉన్న సబ్ జైళ్లు, జిల్లా జైళ్లకు సరఫరా చేస్తున్నారు. రాష్ట్రంలో దాదాపు 5,500 మంది ఖైదీలకు అవసరమయ్యే వంట నూనె రెడ్డిపల్లి జిల్లా జైలులోనే తయారు చేస్తున్నారు. దానిని డబ్బాల్లో నింపడం, ప్యాకింగ్ చేయడం లాంటి పనులన్నీ ఖైదీలే చక్కబెడుతున్నారు.

ఏడాదికి రూ.60 లక్షల ఆదాయం

జిల్లా జైలులో వేరుశనగ ప్లాంటు నిర్వహణతో ఏడాదికి రూ. 60 లక్షలకు పైగా ఆదాయం వస్తోంది. సుధార్ నూనె ద్వారా ఏడాదికి రూ.3 కోట్లకు పైగా లావాదేవీలు జరుగుతున్నాయి. ఇందులో 15 నుంచి 20 శాతం వరకు ఆదాయం వస్తున్నట్లు జైలు అధికారులు చెబుతున్నారు. వేరుశనగ చెక్క ద్వారా అదనపు ఆదాయం వస్తోంది.

నాణ్యతకు సుధార్ పెద్దపీట

ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న వంట నూనెల్లో చాలా వరకు కల్తీమయమే. ఇక్కడ నూనె ఉత్పత్తిలో చాలా నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారు. లీటరు నూనె తయారీకి 2.7 కిలోల వేరుశనగ విత్తనాలను ఉపయోగిస్తున్నారు. టెండరు ద్వారా ఒకేసారి వేరుశనగ విత్తనాలు భారీ ప్రమాణంలో కొనుగోలు చేయడం వల్ల లీటరు నూనె తయారీకి దాదాపు రూ.260 ఖర్చు అవుతోంది. నూనెను తీయగా వచ్చిన వేరుశనగ చెక్కను బహిరంగ వేలం ద్వారా విక్రయించి తిరిగి ఆదాయం పొందుతారు. జైళ్ల అవసరాలకు పోనూ.. మిగిలిన నూనెలను స్థానికంగా జైలు సిబ్బందికి, ఇతర ప్రజలకు లీటరు రూ.279 చొప్పున జైలు వద్దే విక్రయిస్తారు. నూనె తయారు చేసే ఖైదీలకు రోజుకు రూ. 160 చెల్లిస్తున్నారు. ఈ మొత్తాన్ని వారి వ్యక్తిగత ఖాతాలో జమచేస్తారు.

ఆరోగ్యమే ధ్యేయం



రాష్ట్రంలో కల్తీ నూనెల వల్ల గతంలో పలుజైళ్లలో ఖైదీలు అనారోగ్యాల బారిన పడుతున్నట్లు సర్వేలో తేలింది. ఈ నేపథ్యంలోనే వేరుశనగ పంట సాగు ఎక్కువగా ఉన్న అనంతపురం జిల్లాలో స్వచ్ఛమైన వంట నూనె ప్లాంట్‌ను పెట్టాలన్న ఆలోచన వచ్చింది. దీంతో ఉన్నతాధికారులు 2016లో నూనె ప్లాంటును ఏర్పాటు చేశారు. జైలులో ఉన్న ఖైదీలతోనే పరిశ్రమను నిర్వహిస్తున్నాం. నాణ్యత, పరిశుభ్రతలో రాజీ లేకుండా ఉత్పత్తి చేస్తున్నాం. ఖైదీల ఆరోగ్య సంరక్షణను దృష్టిలో పెట్టుకుని ప్లాంటు నిర్వహిస్తున్నాం.

\- షఫీవుర్ రెహమాన్, సూపరింటెండెంట్, జిల్లా జైలు

కల్తీ ఆట కట్టిస్తారా..!

- దాడులను కొనసాగించిన విజిలెన్స్
- కుమార్ ఎంటర్‌ప్రైజెస్ సీజ్
- మాల్టోడెక్స్ట్రిన్ పౌడర్ స్వాధీనం
- గాయత్రిలో నమూనాల సేకరణ



గాయత్రి పాల డెయిరీలో యంత్రాల ద్వారా ప్యాకింగ్

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కల్తీపాల రాకెట్ ఆట కట్టించే దిశగా విజిలెన్స్ అధికారులు రెండో రోజు తనిఖీలు కొనసాగించారు. రాప్తాడు మండలం బండమీదపల్లిలో సోమవారం కల్తీ పాల తయారీ కేంద్రాన్ని సీజ్ చేసిన అధికారులు, మరుసటి రోజు గాయత్రి డెయిరీ, కమలా నగర్‌లోని కుమార్ ఎంటర్‌ప్రైజెస్‌లో తనిఖీలు చేశారు. విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఏఓ వాసుప్రకాష్ తనిఖీలలో పాల్గొన్నారు. బండమీదపల్లి రామిరెడ్డి పాలు ఎక్కువ శాతం గాయత్రీ డెయిరీకి సరఫరా అవుతున్నట్లు గుర్తించారు. డెయిరీలో నమూనాలను సేకరించారు. రామిరెడ్డి పాలకల్తీకి వినియోగించిన మాల్టోడెక్సిన్ పౌడర్‌ను కమలానగర్‌లోని కుమార్ ఎంటర్‌ప్రైజెస్ నుంచి కొంటున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ సీఐ సద్గురుడు ఆధ్వర్యంలో డీఈఈ రవీంద్రారెడ్డి, డీసీటీఓ విజయలక్ష్మి రికార్డులను తనిఖీ చేశారు. నిల్వలను పరిశీలించారు. ఇక్కడికి గతంలో స్వల్పంగా వచ్చిన మాల్టోడెక్సిన్.. క్రమంగా పెరిగినట్లు రికార్డుల్లో ఉన్నట్లు తెలిసింది. మాల్టోడెక్సిన్ పౌడర్‌ను సీజ్ చేసి, స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకుడు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి, సంస్థను సీజ్ చేశారు.


ప్రజల్లో చైతన్యం పెరగాలి



వివరాలు చెబుతున్న డీఎస్పీ

కల్తీకి అడ్డుకట్ట పడాలంటే ప్రజలలో చైతన్యం పెరగాలని విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణం అన్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. కొద్దిపాటి సమాచారంతో 20 రోజులుగా కల్తీ పాల ర్యాకెట్‌పై నిఘా వేశామని, పక్కా సమాచారంతో బండమీదపల్లిలో తనిఖీ చేశామని తెలిపారు. డెయిరీ నిర్వాహకుడు రామిరెడ్డి వ్యవహారం బయట పడిందని తెలిపారు. కల్తీ పాల నమూనాలను ల్యాబ్‌కు పంపించామని, నివేదిక ఆధారంగా చర్యలు ఉంటాయని తెలిపారు. పాలలో మాల్టోడెక్సిన్, పామాయిల్, ఉప్పు కలపడం ప్రమాదకరమని అన్నారు. పది లీటర్ల స్వచ్ఛమైన పాలలోకి పది లీటర్లు నీరు, మాల్టోడెక్సిన్ పౌడర్‌తో తయారు చేసిన అర లీటరు ద్రవం కలిపి.. గాయత్రి, విజయ తదితర డెయిరీలకు సరఫరా చేశారని తెలిపారు. రెండు మూడు డెయిరీల ద్వారా రోజుకు లక్ష లీటర్ల పాలు ప్యాకెట్ల రూపంలో మార్కెట్‌లోకి వెళుతోందని తెలిపారు. కల్తీ పాలతో క్యాన్సర్ వంటి ప్రమాదకర జబ్బులు వస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దాడులను కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

కల్తీ పెరుగుతోంది..




కల్తీ రాకెట్ ఎప్పటి నుంచో ఉంది. ఇటీవల ఆహార పదార్థాల కల్తీ పెరిగింది. జిల్లాలో క్రమం తప్పకుండా నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నాము. కల్తీ అని తేలితే చర్యలు తీసుకుంటున్నాము. జిల్లా నుంచి 57 నామూనాలు పరిశీలనకు పంపితే.. 11 ప్రమాదకరంగా కల్తీ అయినట్లు తేలింది. పాల కల్తీ మరీ దారుణంగా తయారైంది. బండమీదపల్లి ఘటన దీనికి నిదర్శనం. కల్తీ కట్టడికి మరిన్ని చర్యలు తీసుకుంటాం.

\- తస్లీం, ఫుడ్ సేఫ్టీ అధికారి

కేన్సర్‌పై ఆందోళన వద్దు

తొలిదశలో చికిత్సతో నయం

పెద్దాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు



ర్యాలీని ప్రారంభిస్తున్న డాక్టర్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మాణిక్యాలరావు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): కేన్సర్ వచ్చిందని బాధితులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, సరైన జాగ్రత్తలతో తొలిదశలోనే చికిత్స తీసకుంటే వ్యాధి నయమవుతుందని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తొలిదశలో స్ర్కీనింగ్ పరీక్షలతో ఈ మహమ్మారిని నివారించవచ్చన్నారు. ప్రపంచ కేన్సర్ నివారణ దినం సందర్భంగా మంగళవారం జిల్లాకేంద్రంలో బోధనాసుపత్రి ఆధ్వర్యంలో మెడికోలతో కలిసి డాక్టర్లు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల వద్ద డాక్టరు వెంకటేశ్వరరావు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. డాక్టర్లు, మెడికోలు సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా వైద్యశాఖ ఆధ్వర్యంలో వైద్యశాఖ కార్యాలయం నుంచి డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి, ప్రోగ్రామ్ ఆఫీసర్లు, వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈసందర్భంగా సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యాలరావు, డీఎంహెచ్‌ఓ డాక్టరు ఈబీదేవి కేన్సర్ గురించి వివరించారు. కేన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి, తగిన చికిత్సలు తీసుకుంటే నయమవుతుందన్నారు. దీనికి ప్రతి ఒక్కరు స్ర్కీనింగ్ చేయించుకుంటే సులభంగా నివారించవచ్చన్నారు. పరీక్షల్లో కేన్సర్ అని తేలితే ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉచితంగా ప్రభుత్వం చికిత్స అందిస్తుందన్నారు. కార్యక్రమాలలో రేడియోథెరపిస్టు డాక్టరు సతీష్, డాక్టరు మధుసూదన్, డాక్టరు పరదేశీనాయుడు, వైద్యశాఖ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టరు నారాయణస్వామి, డీఐఓ డాక్టరు యుగంధర్, మెడికల్ ఆఫీసర్లు, వైద్యసిబ్బంది, మెడికోలు పాల్గొన్నారు.

ప్రపంచానికి అనంత పంట

నేడు అనంత ఉద్యాన సమ్మేళనం

అరటి సహా ఉద్యాన దిగుబడుల ఎగుమతే లక్ష్యం

మూడు ప్రముఖ కంపెనీలతో ఒప్పందం

హాజరు కానున్న ప్రజాప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు



అనంత ఉద్యాన సమ్మేళనం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'అనంత ఉద్యాన సమ్మేళనం' నిర్వహణకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. బళ్లారి రోడ్డులోని ఎంవైఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల దాకా హార్టికల్చర్ కాంక్లేవ్ జరగనుంది. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు, దేశ విదేశీ కంపెనీల ప్రతినిధులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, రైతులు పాల్గొంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 1,04021 హెక్టార్ల విస్తీర్ణంలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ఏడాదికి 25.96 లక్షల మెట్రిక్ టన్నుల ఉద్యాన దిగుబడులతో రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గా పేరు సంపాదించింది. జిల్లా జీవీఏలో 45 శాతం వాటా ఒక్క ఉద్యాన ఉత్పత్తుల ద్వారా లభిస్తోంది. రాష్ట్ర జీఎస్‌డీపీలో 11.73 శాతం వాటా జిల్లా ఉద్యాన ఉత్పత్తుల ద్వారా సాకారమవుతోంది. ఈ నేపథ్యంలో జిల్లాలో స్వర్ణాంధ్ర, స్వర్ణాంధ్ర అనంతపూర్ విజన్-2047 సాధించేందుకు అరటి, ఎండు మిరప, చీనీ, టమోటా, మామిడి పంటలను జిల్లా ఉద్యాన గ్రోత్ ఇంజన్స్‌గా (తరువాయి 7లో)

ఎన్‌పీసీఐ లింక్‌తో స్కాలర్‌షిప్‌లు పదిలం

ఆధార్‌తో బ్యాంకుకు లింక్ చేసుకోండి

ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో అందించే స్కాలర్‌షిప్పులు(ఫీజు రీయింబర్స్‌మెంట్)ను ఎన్‌పీసీఐ లింక్‌తో పదిలపరుచుకోవాలని ఎస్సీ సంక్షేమశాఖ డీడీ ప్రతాప్ సూర్యనారాయణరెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన స్పష్టం చేశారు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్ము జనవరి నెలలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. జిల్లాలో 598 మంది విద్యార్థులు తమ బ్యాంకు ఖాతాలకు ఎన్‌పీసీఐ(నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) లింక్ చేసుకోకపోవడంతో జమకాలేదన్నారు. విద్యార్థులు తమ బ్యాంకుల వద్దకెళ్లి ఆధార్ కార్డు నెంబర్‌తో ఎన్‌పీసీఐ లింక్ చేసుకొని ఫీజు రీయింబర్స్‌మెంట్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలన్నారు.



రైతు బిడ్డ

కూడేరు మండలం శివరాంపేట రైతు ఎర్రిస్వామికి నలుగురు కూతుళ్లు. ముగ్గురిని పదో తరగతి వరకూ చదివించి, పెళ్లి చేసి అత్తారింటికి పంపించారు. చిన్న కూతురు ఇందు ఉరవకొండలో డిగ్రీ చదువుతోంది. ఎర్రిస్వామికి రెండు ఎకరాల పొలం ఉంది. దీనికితోడు గ్రామ సమీపంలో ఆరు ఎకరాలను కౌలుకు తీసుకుని, వేరుశనగ సాగు చేశారు. రబీ పంట కావడంతో బోరు నీరే ఆధారం. ఆయనకు కొడుకులు లేరు. ఆ లోటును ఇందు తీరుస్తోంది. ఉదయమే నాన్నతో కలిసి పొలానికి వెళుతుంది. తుంపర సేద్యంలో సాయపడుతుంది. నాన్నతో కలిసి బరువైన పైపులను భుజానికి ఎత్తుకుని.. పొలంలో మారుస్తుంది. ఆ తరువాత ఇంటికి వెళ్లి తయారై.. కాలేజీకి వెళుతుంది. 'నా భార్య కూలి పనులకు వెళుతుంది. సేద్యంలో నా బిడ్డ తోడుగా ఉంటోంది' అని ఎర్రిస్వామి అన్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

వైభవంగా రథసప్తమి వేడుకలు

● ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో సూర్యనారాయణస్వామి

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వ ం ఁ డ లం లో ని బూదగవి సూర్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలల నుంచి కాకుండా, కర్ణాటక ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అష్టోత్తర శతక్షీరాభిషేక కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఛాయా ఉష సమేత సూర్యనారాయణస్వామిని పట్టువస్త్రాలతో అందంగా అలంకరించి అర్చకులు కల్యాణా న్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో మహాగణపతి, నవగ్రహ, మృత్యుంజయ, మహాసౌరపూర్వక అరుణహోమాన్ని చేపట్టారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలోని సూర్యనారాయణస్వామి ఆలయంలో రథసప్తమిని పురస్కరించుకుని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు మహేంద్రగౌడ్, సుధాకర్, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

ప్రణాళికతో పదింతల ఫలితం

సాధన చేస్తే మంచి మార్కులు

పది విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచనలు



కొత్తచెరువు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థి జీవితానికి తొలి సోపానం పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నాయి. విద్యార్థులపై ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసింది. సంవత్సరమంతా కష్టపడి చదివిన శ్రమ వృథాకాకుండా ఉండాలంటే రాబోయే కాలాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. విద్యార్థులు టైం టేబుల్ రూపొందించుకొని చదివితే మంచి మార్కులు సాధించవచ్చని, చదువుతో పాటు తగిన నిద్ర, విశ్రాంతి అవసరమని చెబుతున్నారు. పదో తరగతి విద్యార్థుల కోసం ఆయా సబ్జెక్టుల ఉపాధ్యాయుల సూచనలు ఇలా ఉన్నాయి.

● సులభంగా తెలుగులో మార్కులు

- విశ్వేశ్వరరావు, తెలుగు పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



తెలుగులో మంచి మార్కులు సాధించుకోవడం విద్యార్థుల చేతుల్లోనే ఉంది. చక్కటి రాత, అక్షర దోషాలు, కొట్టివేతలు లేకుండా జాగ్రత్తపడాలి. అవగాహన, ప్రతిస్పందనకు 32 మార్కులు, వ్యక్తీకరణ, సృజనాత్మకతకు 36 మార్కులు, భాషాంశాలకు 32 మార్కులు ఉంటాయి. పద్యపాఠ్యాంశాల నుంచి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. ఒక్కోదానికి రెండు మార్కులు. రెండో ప్రశ్న పరిచిత గద్యభాగం, మూడో ప్రశ్న ఉపవాచకం నుంచి ఉంటాయి. నాలుగు వాక్యాలిచ్చి ఏ కాండమునకు చెందినదో రాయాలి. నాల్గో ప్రశ్నగా పత్రికా ప్రకటన, లేఖ, అపరిచిత గద్యంలో ఏదో ఒక అంశం ఇచ్చి నాలుగు ప్రశ్నలు ఇస్తారు. వాటిని చదివి ఒక వాక్యంలో సమాధానం రాస్తే నాలుగు ప్రశ్నలకు ఎనిమిది మార్కులు వస్తాయి. వ్యక్తీకరణ, సృజనాత్మకత భాగంలో 5,6,7 ప్రశ్నలన్నీ రాయాలి. కవి పరిచయం, పద్య పాఠ్యాంశాలు చదవాలి. 6,7 ప్రశ్నలకు పరిచయం, కథనం, వ్యాసం, నాటకం, నేపథ్యం ఉంటాయి. 8,9,10 వ్యాసరూప ప్రశ్నలు ఉంటాయి. 11 నుంచి 19 వరకూ రెండు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఇందులో.. శబ్ద, అర్థాలంకారాలు, చందస్సు జాతీయాలు, సంధులు, సమాసాలు ఉంటాయి. వీటిపై నిరంతరం సాధన అవసరం.

● హిందీ కష్టమేమీ కాదు

- ఇందిర, హిందీ పండిట్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



హిందీ అంటే కష్టం అనే భయాన్ని వదిలేయాలి. హిందీలో పద్యాలు, వ్యాకరణం, సాహిత్యం నేర్చుకుంటే ఎక్కువ మార్కులు సాధించవచ్చు. సాఖీ పాఠం నుంచి మొదటి నాలుగు ప్రశ్నలు, దోహే పాఠం నుంచి ఏదో ఒక ప్రశ్న ఉంటుంది. ఉపవాచకంలో మొదటి, రెండు పాఠ్యాంశాల నుంచి రెండు ప్రశ్నలు ఇస్తారు. పద్యాలు, కవులు, పాఠాలు, రచయితల గురించి తండ్రి, పుస్తక విక్రేతకు లేఖ రాయడం నేర్చుకోవాలి. ఎస్‌సీఈఆర్‌టీ ప్రణాళికను అనుసరిస్తే 90 శాతం పైగా మార్కులు సాధించవచ్చు.

● ఆంగ్లంపై ఆందోళన వద్దు

- ఎల్‌వీ రమణ, ఆంగ్ల ఉపాధ్యాయుడు, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



ఆంగ్లం అంటే అందరూ ఆందోళన పడుతుంటారు. అర్థం చేసుకుంటూ చదివితే చాలా సులభం. ఆంగ్ల పరీక్ష పేపర్ మూడు భాగాలుగా ఉంటుంది. సెక్షన్-ఏలో రీడింగ్ కాంప్రెహెన్షన్ 30 మార్కుల్లో 24 బహుళైచ్ఛిక ప్రశ్నలు ఉంటాయి. ఆరు మార్కులకు సాధారణ ప్రశ్నలు ఉంటాయి. 1 నుంచి 15, 16, 17 ప్రశ్నలపై దృష్టి సారిస్తే మార్కులు సులువుగా వస్తాయి. సెక్షన్-బిలో ఒకాబులరీ, గ్రామర్ 40 మార్కులకు ఉంటుంది. మొత్తం పాఠ్యంశాలు బాగా చదివితే 18 నుంచి 34 ప్రశ్న వరకూ సమాధానాలు రాసి మార్కులు సాధించవచ్చు. సెక్షన్-సిలో 30 మార్కుల్లో 35 వ ప్రశ్న డైరీ రైటింగ్, 36వ ప్రశ్న లెటర్ రైటింగ్, 37వ ప్రశ్న పేరాగ్రాఫ్ రైటింగ్ ఉంటాయి. క్రియేటివ్, లెటర్ రైటింగ్, కన్వర్షన్, బయోగ్రఫీ ప్రశ్నలపై సాధన చేయాలి.

● మ్యాప్‌లపై దృష్టి సారించాలి

- మాధవీలత, సాంఘిక శాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు



సాంఘిక శాస్త్రంలో మ్యాప్‌లు గీయడం, ప్రాంతాలు గుర్తించడంపై దృష్టి సారించాలి. పరీక్షల్లో 33 ప్రశ్నలు, 4 సెక్షన్లు ఉంటాయి. జాగ్రఫీ, చరిత్ర, పౌర శాస్త్రం, ఆర్థిక శాస్త్రం ప్రశ్నలకు 23 చొప్పున మార్కులు, మ్యాప్ పాయింటింగ్‌కు 8 మార్కులు ఉంటాయి. 4,8 ప్రశ్నలకు జవాబులు రాసేటప్పుడు విధిగా సైడ్ హెడ్డింగులు పెట్టాలి. పాయింట్ల రూపంలో జవాబులు రాస్తూ ప్రధాన విషయానికి అండర్‌లైన్ చేయాలి. అక్షరాలు గుండ్రంగా రాస్తే పూర్తి మార్కులు సాధించవచ్చు.

● చిత్రాలపై సాధన చేయాలి



భౌతిక శాస్త్రం 50 మార్కులకు ఉంటుంది. 17 ప్రశ్నలకు జవాబులు రాసేందుకు సమయం రెండు గంటలు. ఒకమార్కు ప్రశ్నలు 8 ఉంటాయి. రెండు మార్కుల ప్రశ్నలు మూడు, నాలుగు మార్కుల ప్రశ్నలు మూడు ఉంటాయి. (వీటికి చాయిస్ ఉండదు) 12వ ప్రశ్నకు డయాగ్రామ్‌కు చాయిస్ ఉంటుంది. 8 మార్కుల ప్రశ్నకు అంతర్గత చాయిస్ ఉంటుంది. ఆమ్లాలు, క్షారాల యందు చాయిస్‌తో కలిపి 9 మార్కులు ఉంటాయి. కాంతి పరావర్తనము, వక్రీభవనములో చాయిస్‌తో కలిపి 9 మార్కులకు ఉంటుంది. విద్యుత్, మానవుని కన్ను అందమైన ప్రపంచము యూనిట్‌లో 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. రసాయన చర్యలు, సమీకరణాలు, కర్బన సమ్మేళనాలలో 8 మార్కులకు చాయిస్ ఉంటాయి. విద్యుదయస్కాంత యూనిట్, లోహాలు, అలోహాల నందు 8 మార్కులకు చాయిస్ ఉంటుంది. కర్బన సమ్మేళనం యూనిట్‌లో 10 మార్కులు సాధించవచ్చు.

- ఇర్షాద్‌వలి, ఫిజిక్స్, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● గణితంలో వంద మార్కులు సాధ్యమే



ఇతర సబ్జెక్టులతో పోలిస్తే గణితంలో వందకు వంద మార్కులు సాధించవచ్చు. గణితంలో నాలుగు సెక్షన్లు ఉంటాయి. సెక్షన్-1లో 12, సెక్షన్-2లో 16, సెక్షన్-3లో 32, సెక్షన్-4లో 40 మార్కులకు ప్రశ్నలు ఉంటాయి. త్రికోణమితిలో ప్రతి లెక్కనూ బొమ్మలతో వివరిస్తే మంచి మార్కులు వస్తాయి. ప్రతి లెక్కకూ సూత్రాలను అన్వయించాలి. త్రిభుజాలు, రేఖా సమీకరణాలు, ఉపరితల వైశాల్యం తదితర పాఠాల నుంచి 1,2 మార్కులు ఎక్కువగా వస్తాయి. బహుపదుల నుంచి నాలుగు మార్కుల ప్రశ్నలపై దృష్టి సారించాలి. గ్రాఫ్ ఆధారిత లెక్కలు, సాంఖ్యక శాస్త్రం, రేఖా గణితం, వాస్తవ సంఖ్యలపై పట్టు సాధించాలి. ముఖ్యమైన సూత్రాలను గుర్తు పెట్టుకోవాలి. (హెచ్.సి.బి), గ.సా.భ.(ఎల్.సి.బి), కసాగు అంక గణితం, సగటు, మధ్యగణితం, బాహులకం వంటి లెక్కలపై దృష్టి పెట్టాలి. కొట్టివేతలు లేకుండా చూసుకోవాలి.

- డి.భాస్కర్‌రెడ్డి, గణితం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

● బ్లూప్రింట్ ఆధారంగా చదవాలి



జీవశాస్త్రంలో 50 మార్కులకు 17 ప్రశ్నలు ఉంటాయి. బ్లూప్రింట్ ఆధారంగా జీవక్రియలు అనువంశికత, ప్రత్యుత్పత్తిపై విద్యార్థులు దృష్టిసారించి చదివితే అధిక మార్కులు సాధించవచ్చు. చిత్రాలు, భాగాలు గుర్తించడం వంటి ఆధారంగా ప్రశ్నలు ఉం టాయి. ప్రయోగాలు చేసే విధానం బే దాలపై సాధన చేయా లి. వీటిని అనుసరిస్తే విద్యార్థులు జీవశాస్త్రంలో అనుకున్న మార్కులను సాధించగలుగుతారు.

- వెంకటశివారెడ్డి, జీవశాస్త్రం, జడ్పీహెచ్ఎస్, కొత్తచెరువు

ఎన్నేళ్లు ఇలా..?

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం అన్నదాతల నిరీక్షణ

జిల్లా వ్యాప్తంగా పెండింగ్‌లో 50వేలకుపైగా దరఖాస్తులు

డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్న 11 వేల మంది

వేధిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత

అనంతపురం రూరల్/కూడేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బోరు బావుల్లో సమృద్ధిగా నీరున్నా, విద్యుత్ సౌకర్యం లేక రైతులు పంటలు సాగు చేయలేని స్థితిని ఎదుర్కొంటు న్నారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడంలో నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి దాపురించింది. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం వేల దరఖాస్తులు విద్యుత్ శాఖలో మూలుగుతున్నాయి. జిల్లా విద్యుత్ శాఖ లెక్కల ప్రకారం డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం ఎదురుచూస్తున్న రైతుల సంఖ్య 11వేలకు పైగానే ఉంది. ఈమేరకు రైతుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

కళ్యాణదుర్గం డివిజన్‌లో అధికంగా పెండింగ్

జిల్లాలోని అనంతపురం, గుత్తి, కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో ఇప్పటికే 2.02లక్షల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయి. ఈ మూడు డివిజన్ల పరిధిలో కొత్తగా మరో 50వేలకుపైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటికి తోడు 11,111 మంది రైతులు కనెక్షన్ల కోసం డబ్బులు చెల్లించి ఎదురుచూస్తున్నారు. కళ్యాణదుర్గం డివిజన్ పరిధిలో 6003, అనంతపురం డివిజన్ పరిధిలో 2847, గుత్తి డివిజన్ పరిధిలో 2261 మంది రైతులు డబ్బులు చెల్లించి కనెక్షన్ల కోసం నిరీక్షిస్తున్నారు. జిల్లా విద్యుత్ శాఖలో పరిధిలో ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటి వరకు వ్యవసాయ కనెక్షన్ల కోసం చెల్లించిన వారికే 2,950 ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాల్సి ఉంది. ఇదే క్రమంలో కండక్టర్(వైరు) 2034కిలో మీటర్ల మేర అవసరం ఉంది.

ప్రజా ప్రతినిధులు చొరవ చూపితేనే...

ఏపార్టీ అధికారంలో ఉన్నా మాది రైతు ప్రభుత్వం. రైతుల సంక్షేమమే మాధ్యేయం అని నాయకులు, ప్రజాప్రతినిధులు ఊదరగొడుతుంటారు. కానీ వారి మాటలు, హామీలు అన్నీ నీటిమీద బుడగలే. జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలే ఇందుకు నిదర్శనం. రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు సకాలంలో మంజూరుకాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పంటకు నీరందించేందుకు కరెంటు కనెక్షన్ లేకపోవడంతో అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. ఏళ్ల తరబడి ఇదే దౌర్భాగ్య పరిస్థితి. ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులకు ఇవి తెలియనివీ కావు. అయినా అలా వింటూ.. చూస్తూ.. ఉండిపోవడం వారికి పరిపాటైపోయింది. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే జిల్లా రైతాంగానికి మేలు జరిగే అవకాశం ఉంటుంది.

● ఏడాదిగా ఎదురుచూస్తున్నా



వ్యవసాయ కనెక్షన్ కోసం ఏడాది కాలంగా ఎదురుచూస్తున్నా. ట్రాన్స్‌ఫార్మర్ ఇచ్చారు. కండక్టర్ ఇంత వరకు ఇవ్వలేదు. నాలుగు ఎల్‌టి స్తంభాలకు వైరు, మూడు స్తంభాలకు సర్వీసు వైరు ఇవ్వాల్సి ఉంది. ఇంత వరకు ఇవ్వలేదు.

- రమేష్, కొర్రకోడు, కూడేరు మండలం


● ఆరేడేళ్లుగా ఎదురుచూపులే



టీడీపీ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్ వచ్చింది. ఆ తరువాత ఇతర సామగ్రి ఏది ఇవ్వలేదు. ఇప్పటికి దాదాపు ఆరేడేళ్లు అవుతోంది. వైరు ఇవ్వలేదు. ఇతర సామగ్రి ఇవ్వలేదు. విసుగెత్తి అడగటమే మానేశా. పక్క రైతును అడిగి ఒకే దిమ్మెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకుని వినియోగించుకుంటున్నా.

- వెంకటేష్, రైతు కొర్రకోడు, కూడేరు మండలం

● వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చాం



జనవరి నెలలో రైతులకు వెయ్యి ట్రాన్స్‌ఫార్మర్లు అందించాం. ఇంకా అవసరం ఉన్నాయి. ఆ మేరకు సంస్థ ఉన్నతాధికారులకు నివేదించాం. కండక్టర్ కొరత ఉంది. రెండువేల మీటర్ల కండక్టర్ కావాలి. ఈ నెలలో కండక్టర్, ట్రాన్స్‌ఫార్మర్లు వస్తాయి. వచ్చిన వెంటనే రైతులకు సీనియార్టీ మేరకు అందిస్తాం.

- సంపత్‌కుమార్, ఎస్ఈ, విద్యుత్ శాఖ

వాటర్‌షెడ్ పనుల్లో గోల్‌మాల్

గత ప్రభుత్వంలో రూ.5 కోట్ల దుర్వినియోగం

వైసీపీ కార్యాలయంలో వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు

నాయకులు, అధికారుల జేబుల్లోకి నిధులు

తాజాగా వెలుగులోకి వస్తున్న అప్పటి అక్రమాలు

అక్రమార్కులకు క్లీన్‌చిట్ ఇస్తున్న వైనం

డ్వామా విజిలెన్స్‌లో మాయాజాలం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ పనుల్లో జరిగిన అక్రమాలు ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో అధికారులు, నాయకులు కుమ్మక్కై ప్రజాసొమ్మును మెక్కేశారు. గత ఐదేళ్లలో వాటర్‌షెడ్ నిధులను సుమారు రూ.5కోట్ల మేర బొక్కేశారు. వాటర్‌షెడ్ పనులన్నీ అప్పటి వైసీపీ నేతల కనుసన్నల్లో సాగాయి. పార్టీ కార్యాలయాల్లోనే వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు నిర్వహించడం ఇందుకు నిదర్శనం. వీటిపై నిఘా పెట్టాల్సిన నిఘా అధికారులే వారితో కుమ్మక్కయ్యారనే ఆరోపణలు ఉన్నాయి. వాటర్‌షెడ్ ద్వారా రూ.5కోట్ల వరకు నిధులు దుర్వినియోగం చేసినట్లు సామాజిక తనిఖీలో తేటతెల్లమైంది. ఈ సొమ్మును రికవరీ చేయడానికి డ్వామాలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విజిలెన్స్ విభాగం నిర్లక్ష్యం చేస్తోంది. ఆ విభాగంలో కీలకంగా ఉన్న ఇద్దరు అధికారులతో పాటు పలువురు ఉద్యోగులు, వాటర్‌షెడ్ విభాగం అధికారులు ఇందులో భాగస్వాములుగా ఉన్నట్లు తెలుస్తోంది.

వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో వాటర్‌షెడ్ పనులన్నీ ఆ పార్టీ నాయకుల కనుసన్నల్లో జరిగాయి. పంచాయతీ పరిధిలోని సర్పంచ్, గ్రామ పెద్దలు, వాటర్‌షెడ్ అధికారుల సమక్షంలో గ్రామసభ నిర్వహించి పనులకు ఆమోదం పొందాలి. ఇందుకు భిన్నంగా వాటర్‌షెడ్ కమిటీ సమావేశాలు అప్పటి వైసీపీ ప్రజాప్రతినిధుల ఇళ్లలోనూ, వైసీపీ కార్యాలయాల్లోనూ నిర్వహించారు. పనులు చేయకపోయినా బిల్లులు చేసుకుని నిధులు స్వాహా చేశారు.

రూ.5 కోట్లు హాంఫట్

జిల్లాలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో వాటర్ షెడ్ పథకం కింద రూ.6.5 కోట్ల వరకు నిధులు పక్కదారిపట్టాయి. ఇప్పటి వరకు రూ.1.5 కోట్లు మాత్రమే రికవరీ చేశారు. మిగిలిన సొమ్మును రికవరీ చేయడంలో నిఘా విభాగం అధికారులు విఫలమవుతున్నారని తెలుస్తోంది. ఇందులో వాటర్‌షెడ్ పీఓ, ఏపీఓ, టీఓ, సీఓలకు సంబంధించిన క్రిమినల్ కేసులు నమోదు కాగా.. రూ.1.93 కోట్లు నిధులు దుర్వినియోగమైనట్లు తేల్చారు. ఏపీఎం నుంచి ఒక కేసుకు సంబంధించి రూ.1.08 కోట్లు, కమ్యూనిటీ కోఆర్డినేటర్ నుంచి మూడు కేసులకు రూ.1.03 కోట్లు, గ్రామైక్య సంఘం సహాయకుల నుంచి మూడు కేసులకు గాను రూ.97.64 లక్షలు సొమ్మును రికవరీ చేయాల్సి ఉంది.



పనిచేసిన ఏడాదిలోపే చిన్నపాటి వర్షానికే కొట్టుకు పోయిన గోళ్ల వాటర్‌షెడ్ పరిధిలోని రాతితో నిర్మించిన ఫారంపాండ్

బూదగవి, గోళ్ల వాటర్‌షెడ్లలో ఇష్టానుసారం బిల్లులు

ఉరవకొండ నియోజకవర్గంలోని బూదగవిలో సుమారు రూ.90 లక్షల బిల్లులు చేయగా ఇందులో సగం కూడా పనులు చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధి పథకం కింద చేసిన ఫారంపాండ్లను నల్లరేగడి నేలల్లో వాటర్‌షెడ్ కింద కూడా బిల్లులు చేసుకున్నట్లు సమాచారం. కళ్యాణదుర్గం మండలం గోళ్ల పంచాయతీ వాటర్‌షెడ్‌లోనూ ఇదే పరిస్థితి. రాప్తాడు మండలం హంపాపురంలో ఒక్కో పనికి రెండు సార్లు బిల్లులు పెట్టారనే విమర్శలు ఉన్నాయి. శింగనమల మండలం వెస్ట్‌నరసాపురం, తాడిపత్రి మండలం సజ్జలదిన్నె గ్రామ వాటర్‌షెడ్లలోనూ చేయని పనులకు, ఉపాధి పథకం కింద చేసిన పనులకు బిల్లులు చేశారని సమాచారం.

ప్రతి పైసా లెక్కిస్తాం

వాటర్‌షెడ్ ప్రాజెక్టుల్లో చేపట్టిన ప్రతి పనికి వెచ్చించిన ప్రతి పైసా లెక్కిస్తాం. ఎక్కడైనా సరే లెక్క తప్పితే కచ్చితంగా సంబంధిత సిబ్బంది లేదా పనిచేసిన వారి నుంచి రికవరీ చేస్తాం. వాటర్‌షెడ్ ప్రాజెక్ట్‌లో మొత్తం పనిలో 10 శాతం నిధులు హోల్డ్‌లో ఉంటాయి. పూర్తి పనికి సంబంధించిన వివరాలు, రికార్డులు అందజేసినప్పుడే ఆ నిధులు చెల్లిస్తాం. ఇందులో ఎంతటివారినైనా ఉపేక్షించేదిలేదు. ప్రభుత్వ సొమ్ముకు జవాబుదారిగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉంది. గతంలో చేసిన పనులపై ఫిర్యాదులు వస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేస్తాం.

-సలీం బాషా, పీడీ, డ్వామా



బూదగవి వద్ద ఉపాధి నిధులతో తవ్విన ఈ ఫారంపాండ్లకు.. వాటర్‌షెడ్ కింద బిల్లులు చేసుకున్నారు



గరుడ వాహనంపై స్వామి వారు

వైభవంగా నారసింహుడి కల్యాణం

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమిని పురస్కరించుకుని స్వామి వారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌కు అభిషేకాలు, పూజలు చేశారు. రథసప్తమి సందర్భంగా సూర్యప్రభ, గరుడ, గోవాహనోత్సవం, హనుమద్వాహన సేవలను నిర్వహించారు. ఉత్సవమూర్తులను వాహనాలపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారిని పట్టు వస్త్రాలతో అలంకరించి, అర్చకులు ద్వారకనాథాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని చేపట్టారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చారు. కార్యక్రమాల్లో ఆలయ ఈవో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవారు

క్రైం కార్నర్

ముత్యాలమ్మ ఆలయంలో చోరీ



ఆలయంలో హుండీని పగలకొట్టిన దృశ్యం

రామగిరి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన ముత్యాలమ్మ ఆలయంలో హుండీని పగలకొట్టి దుండగులు చోరీ చేశారు. ఆలయ ఈఓ వెంకటేశులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... సోమవారం రాత్రి 10:30 గంటలు దాటిన తర్వాత ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఆలయంలో హుండీని పగలకొట్టి అందులో ఉన్న మొత్తాన్ని, వస్తువులను ఎత్తుకెళ్లారు. నవంబరు 23 తర్వాత హుండీ ఆదాయాన్ని లెక్కించలేదు. దాదాపు రూ.1.5లక్షల వరకు ఉండవచ్చని అధికారులు అంచనా వేశారు. ముఖానికి మాస్కు ధరించి ఆలయం లోకి చొరబడినట్లు సీసీకెమెరాలో నమోదైందన్నారు. రామగిరి ఎస్‌ఐ సుధాకర్‌యాదవ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసుకున్నారు.

యువతి అదృశ్యం



శిరీష (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఓ యువతి అదృశ్యమైంది. ఆత్మకూరు మండలం సిద్దరాంపురం గ్రామానికి చెందిన మల్లెల శిరీష కొన్ని రోజుల క్రితం అనంతపురం రూరల్ మండలంలోని పిల్లిగుండ్ల కాలనీలో నివాసముంటున్న తన పెద్దమ్మ వాళ్లఇంటికి వచ్చింది. సోమవారం ఉదయం శిరీష ఇంటి నుంచి అదృశ్యమైంది. మంగళవారమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఈక్రమంలోనే తండ్రి రామాంజనేయులు అనంతపురం రూరల్ పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు.

ఆన్‌లైన్ బెట్టింగ్‌తో అప్పులు..
యువకుడి ఆత్మహత్య

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ జూదం ఆడి, అప్పులపాలైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. నగరంలోని అశోక్‌నగర్‌కు చెందిన శంకర్(29) గతంలో టీవీఎస్ ఫైనాన్స్ విభాగంలో పని చేసేవాడు. ఐదేళ్ల కిందట ఇతడికి స్రవంతి అనే యువతితో వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. శంకర్ గత కొంతకాలంగా ఆన్‌లైన్‌లో బెట్టింగ్ ఆడేవాడు. ఈ క్రమంలో రూ.లక్షల్లో అప్పులు చేశాడు. రుణదాతల ఒత్తిళ్లు అధికం కావడంతో తీవ్ర మనస్తాపం చెందాడు. ఈక్రమంలోనే మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని మృతి చెందాడు. ఈ ఘటనపై వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ ఉచ్చులో పడి మోసపోయిన రైతు

బెళుగుప్ప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల ఉచ్చులోపడి మండలంలోని శ్రీరంగాపురానికి చెందిన పురుషోత్తమ్ అనే రైతు మంగళవారం రూ. పది వేలు పోగొట్టుకున్నాడు. వివరాలు ఇలా రైతు పురుషోత్తమ్‌కు మంగళవారం ఉదయం ఓ నెంబరు నుంచి ఫోన్‌కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తన పేరు భార్గవ్ అని, బెంగళూరులో బీటెక్ చదువుతున్నట్లు పరిచయం చేసుకున్నాడు. అనంతరం తనకు యాక్సిడెంట్ జరిగిందని, హైదరాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపాడు. ఆస్పత్రి ఖర్చులకు డబ్బు తక్కువ వచ్చిందని, అత్యవసరంగా రూ.30వేలు పంపమని కోరాడు. 8864054661 నెంబర్‌కు ఫోన్‌పే చెయ్యమన్నాడు. తన వద్ద అంతడబ్బులేదని, రూ.పది వేలు మాత్రమే ఉందని పంపారు. తర్వాత పురుషోత్తం తన కుటుంబ సభ్యులకు ఈ విషయం తెలిపాడు. వారు అనుమానంతో ఫోన్ చేసి ఆరా తీయగా భార్గవ్ కాలేజీలో ఉన్నట్లు తెలిసింది. పురుషోత్తంకు ఫోన్‌కాల్ వచ్చిన 9100493361 నెంబర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. బాధితుడు పోలీసులను సంప్రదించగా 1930కు ఫిర్యాదు చేయమని సూచించారు.

నేడు తుది విడత ఎన్నికలు

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 14 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు బుధవారం తుది విడత ఎన్నికలు జరగనున్నాయి. జిల్లాలోని 121 ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాల నూతన పాలక వర్గం ఎన్నికలకు పశుసంవర్ధక శాఖ ఉన్నతాధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రాథమిక గొర్రెల పెంపక సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా స్థానిక వెటర్నరీ డాక్టర్లు వ్యవహరిస్తున్నారు. ఇప్పటి దాకా మూడు విడతల్లో 107 సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా.. తగిన రికార్డులు లేకపోవడంతో 20 సంఘాల ఎన్నికలు వాయిదాపడ్డాయి. ఆ సంఘాలకు త్వరలో పర్సన్ ఇన్‌చార్జిలను నియమించి, ఎన్నికలు నిర్వహించాలని ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు.

పట్టాలు తప్పిన గూడ్సు వ్యాగన్లు
పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం



పట్టాలు తప్పిన గూడ్సు రైలు

గుంతకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గూడ్సు రైలు పట్టాలు తప్పింది. దీంతో పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. తోరణగల్లు నుంచి వచ్చిన గూడ్సు రైలు డీఆర్‌ఎం కార్యాలయానికి ఎదురుగా సౌత్ కేబిన్ సమీపంలో వంతెన దాటిన తర్వాత మంగళవారం సాయంత్రం 5-45 గంటల ప్రాంతంలో పట్టాలు తప్పింది. 13, 14 నంబర్ల వ్యాగన్లు డీ రైల్ అయ్యాయి. ఈ ప్రమాదం విజయవాడ, చెన్నై లైన్లకు సమీపంలో జరగడంతో రెండు మార్గాల నుంచి వచ్చే రైళ్లకు అంతరాయం ఏర్పడింది. గూడ్సు వ్యాగన్ విజయవాడ లైన్‌లోకి వెళ్లడంతో ఆ మార్గంలో ఉన్న రెండు రైళ్లకు సమస్య ఏర్పడింది. వాస్కో-హౌరా ఎక్స్‌ప్రెస్ వెళ్లిపోయిన తర్వాత ఈ గూడ్సు పట్టాలు తప్పడంతో వెంటనే వచ్చిన అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను కాసేపు నిలిపివేశారు. ఇంజన్‌ను బోగీల రెండో చివర బిగించి డీఆర్‌ఎం కార్యాలయం వైపు కాకుండా బైపాస్ లైన్‌లో మళ్లించారు. ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌ను ముందు స్టేషన్‌లో నిలిపివేశారు. రెస్టోరేషన్ పనులు రాత్రి 8.30 గంటల వరకూ కొనసాగాయి. చెన్నై నుంచి రాత్రి వచ్చిన చెన్నై-ముంబై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ గంటసేపు ఆలస్యంగా నడిచింది.

టమోటా కిలో రూ.13

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.13తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 600 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.10, కనిష్ఠ ధర రూ.8 పలికినట్లు ఆయన తెలిపారు.

బకాయిలు పెట్టి.. పోరుబాటా..?

అధికారం ఉన్నపుడు విద్యార్థులను విస్మరించిన వైసీపీ

- ఉత్తుత్తి బటన్లు నొక్కిన జగన్‌రెడ్డి
- రూ.కోట్ల ఫీజులు పెండింగ్
- అధికారం పోగానే ఫీజులపై పోరు
- మండిపడుతున్న విద్యార్థులు, సంఘాలు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నవ్విపోదురుగాక నాకేటి అన్నట్లుంది వైసీపీ తీరు. గత ఐదేళ్లు అధికారంలో ఉన్న వైసీపీ గతాన్ని మరచిపోయింది. విద్యార్థులు పడే కష్టాలు, సమస్యలను విస్మరించింది. ప్రభుత్వం బాధ్యతగా చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ మొత్తాలను జగన్‌రెడ్డి తన జేబులో నుంచి ఇస్తున్నట్లు ప్రచారం చేసుకున్నారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన పేరుతో ప్రచారం చేసుకున్నారు. విడతల వారీగా ఏడాదికి నాలుగుసార్లు ఉత్తుత్తి బటన్లు నొక్కారు. డబ్బు జమకాకపోవడంతో కళాశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు సొంతంగా ఫీజులు కట్టాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నపుడు పట్టించుకోని వైసీపీ.. దిగిపోగానే ఫీజు పోరుబాట పట్టడంపై విద్యార్థులు, విద్యార్థి సంఘాలు విస్మయం వ్యక్త చేస్తున్నాయి.

ఏడాదికి 54వేల మంది విద్యార్థులు

జేఎన్టీయూ ఆధ్వర్యంలో 120 ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎస్కేయూ ఆధ్వర్యంలో 80 డిగ్రీ, 17 పాలిటెక్నిక్ చొప్పున ప్రైవేటు, ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో రూ.5 వేల నుంచి రూ.20వేల వరకు, ప్రైవేటులో రూ.30వేల నుంచి రూ.70వేల వరకు ఏడాదికి ఫీజులు చెల్లించాలి. కళాశాలల్లో మౌలిక వసతుల ఆధారంగా, కోర్సుల వారీగా ఫీజులు నిర్ధారించారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీబీఏ, బీసీఏ, బీఎస్సీ, బీటెక్‌లో సివిల్, మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, ఫుడ్ టెక్నాలజీ, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ కోర్సులతోపాటు బీఫార్మసీ, పాలిటెక్నిక్ మెకానికల్, సివిల్, ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్, టెక్స్‌టైల్, కంప్యూటర్ సైన్స్ డిప్లమో ఇంజనీరింగ్ కోర్సులున్నాయి. ప్రవేశ పరీక్షల ద్వారా పాలిటెక్నిక్‌లో 3వేలు, ఫార్మసీలో 4వేలు, డిగ్రీలో 17 వేలు, బీటెక్‌లో 30 వేల చొప్పున మొత్తం 50 వేలమంది వరకు విద్యార్థులు ఏటా ప్రవేశాలు పొందుతున్నారు.

రూ.వెయ్యి కోట్లు చెల్లించాలి

పాలిటెక్నిక్, డిగ్రీ మూడేళ్ల కోర్సులు. బీటెక్, బీఫార్మసీ నాలుగేళ్ల చొప్పున కోర్సు కాలం ఉంటుంది. ప్రవేశ సంవత్సరం నుంచి కోర్సు కాలం పూర్తయ్యే వరకు అర్హులైన పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వమే చెల్లించాలి. ఏడాదికి ఫీజు రీయింబర్స్‌మెంట్ మొత్తం దాదాపు రూ.150కోట్లు ఉంటుంది. ఒక్కో విద్యార్థికి హాస్టల్ ఫీజు రూ.10వేల చొప్పున మొత్తం 50 వేల మందికి రూ.50కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. ఈ లెక్కన వైసీపీ ప్రభుత్వంలో గత ఐదేళ్లకుగాను రూ.వెయ్యి కోట్లు విద్యార్థులకు అందాలి. జగన్‌మోహన్ రెడ్డి సీఎం కాగానే.. పీజీ ద్వారా ఎంబీఏ, ఎంసీఏ, ఎంటెక్, ఎమ్మెసీ వంటి కోర్సులు అభ్యసించే విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ చెల్లింపులను ఎత్తివేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే వారికి మాత్రమే ఇస్తామని ప్రత్యేక జీఓ జారీ చేశారు.



పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

ఉత్తుత్తి బటన్లు

ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని జగన్‌మోహన్ రెడ్డి తన జేబులో నుంచి ఇస్తున్నట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు జగనన్న విద్యాదీవెనగా, స్కాలర్‌షిప్‌నకు జగనన్న వసతి దీవెనగా పేర్లు మార్చారు. ఏడాది ఫీజు మొత్తాన్ని ఒకేసారి చెల్లించాల్సి ఉండగా.. విడతల వారీగా విభజించారు. ప్రతి విడతకు జగన్‌మోహన్ రెడ్డి బటన్ నొక్కి నిధులను మంజూరు చేసేవారు. ఇలా సంవత్సరానికి నాలుగు విడతలుగా బటన్ నొక్కినా నిధులు మాత్రం తమ తల్లుల ఖాతాల్లో జమ కాలేదని విద్యార్థులు వాపోతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉత్తుత్తి బటన్లు నొక్కి ఐదేళ్లు మాయ చేశారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

జేబులు గుల్ల చేసిన జగన్

విద్యార్థుల ఫీజులను కళాశాలకే చెల్లించే పద్ధతికి వైసీపీ ప్రభుత్వం మంగళం పాడింది. తల్లుల ఖాతాల్లో జమ చేస్తామని అప్పటి పాలకులు బటన్లు నొక్కారు. దీంతో కళాశాలలు, ప్రభుత్వానికున్న విద్యార్థుల ఫీజుల బంధం తెగిపోయింది. ప్రభుత్వం తమకు చెల్లించకున్నా కళాశాలల యాజమాన్యాలు మాత్రం ముక్కుపిండి వసూలు చేశాయని విద్యార్థులు గుర్తుచేసుకుంటున్నారు. బటన్లు నొక్కి విడుదల చేసిన మొత్తాలు తమ తల్లుల ఖాతాల్లో జమకాలేదని ఆవేదన చెందుతున్నారు. ఏడాదికి నాలుగుసార్లు బటన్ నొక్కితే ఒకట్రెండు బటన్లు మాత్రమే పనిచేశాయి. హాల్ టిక్కెట్లు తీసుకోవాలన్నా, పరీక్షలు రాయాలన్నా, ఫలితాలు చూడాలన్నా, సర్టిఫికెట్లు తీసుకోవాలన్నా కళాశాలలకు సొంతంగా ఫీజులు కట్టామనీ, మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి తమ తల్లిదండ్రుల జేబులు గుల్లచేసి వెళ్లారని మండిపడుతున్నారు.

సొంతంగా ఫీజు కట్టాం..



గత ప్రభుత్వం విద్యాదీవెన చెల్లించకపోవడంతో సొంతంగా ఫీజులు కట్టాం. హాస్టల్, కాలేజీ ఫీజు రెండూ చేతి నుంచే చెల్లించాం. పుస్తకాలు, మెటీరియల్, పరీక్షలు ఇలా అనేక రకాలుగా ఖర్చు చేయాలి. అదనంగా ఫీజుల భారం పడింది. గత ప్రభుత్వం చేతులెత్తేయడంతో ఇంటి నుంచి తీసుకువచ్చి కట్టాల్సి వచ్చింది. పాత సంవత్సరం బకాయిలతోపాటు ఈ ఏడాది ఫీజులను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తుందట.

- అజిత, పాలిటెక్నిక్ విద్యార్థిని

జేబులు గుల్ల చేశారు



ఉచితంగా చదవాల్సిన బీటెక్ ఇంజనీరింగ్‌కు డబ్బు చెల్లించనిదే సంవత్సరం పూర్తికావడం లేదు. ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజులు కన్నవారితో కట్టించి, జేబులు గుల్ల చేశారు. మూడేళ్లపాటు ఇదేతంతు కొనసాగింది. ప్రస్తుత సంవత్సరం మాత్రం ఇంకా ఫీజులు అడగడం లేదు. బ్యాంకుల్లో తెరిచిన తల్లుల ఖాతాలు ఖాళీగున్నాయి. విద్యార్థులకు సంబంధం లేకుండా కళాశాలకే ప్రభుత్వం ఫీజులు చెల్లిస్తుందని అధికారులు చెప్పారు.

- వెంకటేష్ నాయక్, బీటెక్ విద్యార్థి

రూపాయి కూడా రాలేదు



ఫీజులకు సంబంధించి ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. కళాశాల, హాస్టల్ ఫీజు కలిసి సంవత్సరానికి రూ.50 వేలు అవుతుంది. కూలి పనులు చేసి గతేడాది ఫీజులు కట్టాల్సి వచ్చింది. హాల్ టిక్కెట్లు తీసుకోవాలన్నా, పరీక్షలు రాయాలన్నా, ఫలితాలు చూసుకోవాలన్నా ఫీజులు ఎంత బాకీ ఉన్నారని చూసేవారు. సెమిస్టర్ ఫీజు పూర్తిగా కట్టినవారికే హాల్ టిక్కెట్లు ఇచ్చేవారు. ప్రస్తుత సంవత్సరం నుచి పరిస్థితులు మారాయి.

- వనజ, డిగ్రీ విద్యార్థిని

ఫీజులు ఎగ్గొట్టారు



చదువులకు సంబంధించిన ఫీజుల మొత్తాన్ని ఎగ్గొట్టారు. తల్లి ఖాతాలోకి జమచేస్తామని దరఖాస్తులు స్వీకరించారు. సచివాలయంలో ఇద్దరి వేలిముద్రలు వేయించుకున్నారు. బటన్ నొక్కి సంవత్సరంలో నాలుగు విడతలుగా చెల్లిస్తామని చెప్పారు. ఒక్క బటన్ కూడా పనిచేయలేదేమో డబ్బులే రాలేదు.

- ఎలియేజర్, డిగ్రీ విద్యార్థి

వైసీపీ మోసం చేసింది..



గత ఐదేళ్లు విద్యార్థులను వైసీపీ ప్రభుత్వం మోసం చేసింది. కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజులను తల్లుల ఖాతాల్లోకి జమ చేస్తామని మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్లు నొక్కారు. ఒకేసారి ఇవ్వాల్సిన మొత్తాన్ని ఏడాదికి నాలుగు విడతలు చేశారు. సమయానికి కరెక్ట్‌గా ప్రకటనలిచ్చి గట్టిగానే నొక్కాడు. డబ్బులు మాత్రం విద్యార్థుల తల్లుల ఖాతాలో పడలేదు. మళ్లీ మోసం చేసేందుకు వైసీపీ కొత్త నాటకాలకు తెరలేపింది. ఫీజులు చెల్లించకుండా దిగిపోయిన జగన్‌మోహన్ రెడ్డి ఫీజు పోరుబాట చేపట్టడం హాస్యాస్పదం.

- కుళ్లాయిస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి

అధికారం పోతేగానీ తత్వం బోధపడలేదు



సీఎంగా ఉండి బాధ్యతతో పనిచేయాల్సిన జగన్‌మోహన్ రెడ్డి పదవికే కళంకం తెచ్చారు. సాఫీగా సాగే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ ప్రక్రియలకు వక్రభాష్యం చెప్పారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనగా పేర్లు పెట్టుకుని జోరుగా ప్రచారాలు చేసుకున్నారు. అదేస్థాయిలో ఫీజుల మొత్తాలను ఇవ్వకుండానే వెళ్లిపోయారు. అధికారం పోతేగానీ తత్వం బోధపడలేదు. ఐదేళ్లపాటు విద్యార్థి సంఘాలు రోడ్డెక్కి, ఫీజుల కష్టాలు వివరించినా పెడచెవిన పెట్టారు. కూటమి ప్రభుత్వమైనా కళ్లు తెరవాలి.

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

అధికారం మత్తులో కనబడలేదు



పిల్లలను ఉన్నత చదువులు చదివించాలంటే తల్లిదండ్రులు ఎంతో కష్టపడాల్సి ఉంటుంది. అలా కూడబెట్టిన ప్రతిపైసా పుస్తకాలు, బ్యాగులు ఇలా విద్యావసరాలకే ఖర్చు చేస్తారు. గత ఐదేళ్ల అధికారం మత్తులో ఉన్న జగన్‌మోహన్ రెడ్డి, వైసీపీకి తల్లిదండ్రుల కష్టాలు కనబడలేదు. ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ప్రభుత్వం చెల్లించకపోవడంతో అనేకమంది విద్యార్థులు భవిష్యత్తును కోల్పోయారు. కలెక్టరేట్, కళాశాలలను ముట్టడించినా కనికరించలేదు. వైసీపీ గతాన్ని గుర్తు చేసుకుని, పోరుబాట పట్టాలి.

- కమతం బాలకృష్ణ, ఏఐఎస్ఏ జిల్లా కార్యదర్శి

లైనింగ్ అంటే సీమ రైతులకు ఉరితాడే

- హంద్రీనీవా కాలువ 10వేల క్యూసెక్కులకు పెంచాలి
- సీఎం దృష్టికి సీమ రైతుల పరిస్థితి
- ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ నిర్మాణం చేపట్టడం సీమ రైతులకు ఉరితాడు బిగించడమేనని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. హంద్రీనీవా కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ చేయరాదని, కాలువ సామర్థ్యాన్ని 10వేల క్యూసెక్కులకు పెంచాలని డిమాండ్ చేస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జలవనరుల శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ నిరసనకు ముఖ్య అతిథులుగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ రాయల సీమకు వరప్రదాయినిగా ఉన్న హంద్రీనీవాకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ వేయడం మానుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆరు లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చేలా, 10వేల క్యూసెక్కుల సామర్థ్యానికి కాలువ వెడల్పు చేయాలన్నారు. హంద్రీనీవాకు శ్రీశైలం డ్యాం నుంచి కనీసం 80 టీఎంసీల నీటిని కేటాయించాలని డిమాండ్ చేశారు. లైనింగ్ సమస్యను రాయలసీమ రైతుల తరఫున సీఎం చంద్రబాబు, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు జగదీష్ మాట్లాడుతూ ఇది ప్రభుత్వాన్ని మేలుకొలుపే నిరసన అని పేర్కొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఓ నల్లప్ప మాట్లాడుతూ జిల్లాకు ప్రధాన నీటి వనరులైన హెచ్చెల్సీ, హంద్రీనీవాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే సహించేదిలేదని, వెంటనే లైనింగ్ పనులు నిలిపేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇమాం మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హంద్రీనీవా కాలువ సామర్థ్యం పెంచి, డిస్ట్రిబ్యూటరీలు నిర్మించి రైతులను ఆదుకోవాల న్నారు. అనంతరం హంద్రీనీవా సీనియర్ ఈఈ రాజా స్వరూప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్, జిల్లా సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జున, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు రాజారెడ్డి, సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ నాయకులు నాగరాజు, రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, మహిళా సంఘం వెంకటలక్ష్మి, వృత్తిసంఘాల సమాఖ్య నాయకులు రామాంజనేయులు, సీపీఎం నాయకులు రామిరెడ్డి, వెంకటనారాయణ, లింగమయ్య, పద్మావతి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రపంచానికి అనంత పంట

(5వ పేజీ తరువాయి)

గుర్తించారు. వీటికి ప్రపంచస్థాయి గుర్తింపు లభించేలా, జిల్లా ఉద్యాన రైతులకు ప్రయోజనం చేకూరేలా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌ను ఏర్పాటు చేసింది. జిల్లా ఉద్యాన ఉత్పత్తులకు బ్రాండింగ్, ప్రచారం, మౌలిక వసతుల కల్పన, మార్కెటింగ్‌లో పోటీ తత్వాన్ని పెంచడం, రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం, రెండు అంకెల ఆదాయాన్ని రైతుకు కల్పించడం ఈ సమ్మేళనం ముఖ్య ఉద్దేశం. అనంత ఉద్యాన సమ్మేళనంలో 16 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారు. జిల్లా యంత్రాంగం మూడు కార్పొరేట్ ప్రతినిధులతో ఎంఓయూ కుదుర్చుకోనుంది.



తాడిపత్రి రైల్వే స్టేషన్‌లో బనానా రైలును ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా, కలెక్టర్ వినోద్‌కుమార్ (ఫైల్)

చంద్రబాబు చొరవతో..

జిల్లా అరటి రైతులు టన్నుకు రూ.5వేలు కూడా లభించక 2016-17 ఏడాది నష్టపోయారు. అప్పటి సీఎం చంద్రబాబు చొరవచూపి.. ఐఎన్ఐ, దేశాయ్ తదితర కంపెనీలతో ఒప్పందాలు కుదిరేలా చేశారు. 'బనానా ఫ్రూట్ కేర్ యాక్టివిటీ' పరిజ్ఞానాన్ని జిల్లాకు తెచ్చారు. తద్వారా 30 కంపెనీలు అరటి ఎగుమతికి పోటీ పడ్డాయి. టన్ను అరటికి రూ.25 వేలకు తగ్గకుండా ధర లభించింది. ఎకరాకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల ఆదా

భలే గిరాకీ..

2018-19లో మొట్టమొదటి సారి జిల్లాలో ఫ్రూట్ కేర్ యాక్టివిటీ మొదలైంది. జిల్లాలో 10,496 హెక్టార్లల్లో అరటిసాగవుతోంది. ఎక్కువ శాతం పుట్లూరు, యల్లనూరు, యాడికి, నార్పల, పెద్దపప్పూరు, బుక్కరాయసముద్రం మండలాల్లో ఉంది. ఏటా 8.31 లక్షల మెట్రిక్ టన్నుల అరటి దిగుబడి వస్తోంది. టిష్యూకల్చర్‌తో తయారు చేసిన జీ - 9 రకం అరటిని జిల్లాలో సాగు చేస్తున్నారు. డ్రిప్ పద్ధతిలో నీరు, ఎరువులు ఇస్తుండటంతో నాణ్యమైన అరటి వస్తోంది. సాగు పద్ధతిపై కంపెనీల ప్రతినిధులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. తద్వారా అనంత అరటికి గిరాకీ పెరిగింది. జిల్లాలో అరటి కొనుగోలు చేసేందుకు 15 కంపెనీలు పోటీ పడుతున్నాయి. ఆరేళ్లలో పది కంపెనీల ద్వారా 1.59 లక్షల మెట్రిక్ టన్నుల అరటిని రైతులు ఎగుమతి చేశారు. ఇరాన్, సౌదీ అరేబియా, ఖతార్, దుబాయ్‌కి అనంత అరటి తరలింది. 2018లో 18,500 మెట్రిక్ టన్నులు, 2019లో 23వేల మెట్రిక్ టన్నులు, 2020లో 43వేలు, 2021లో 61వేలు, 2022లో 63వేలు, 2023లో 63వేలు మెట్రిక్ టన్నుల అరటి విదేశాలకు ఎగుమతి అయింది.

యం సమకూరుతోందని ఉద్యాన శాఖ అధికారులు అంటున్నారు. అనంత హార్టికల్చర్ కాంక్లేవ్‌కు కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ నేతృత్వంలో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు, వ్యవసాయం, కో-ఆపరేటివ్ సొసైటీస్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరవుతారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గల్ఫ్ దేశాలకు..

తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ఈ ఏడాది నవంబరులో గల్ఫ్ దేశాలకు అరటి ఎగుమతి ప్రారంభమైంది. పెద్దపప్పూరు, పుట్లూరు, యాడికి మండలాల్లోని 45 మంది రైతులు పండించిన రూ.1.50 కోట్ల విలువైన 680 మెట్రిక్ టన్నుల అరటిని కు 34 కంటైనర్లల్లో (బనానా రైలు) పంపించారు. వైసీపీ హయాంలో 2020 జనవరిలో కిసాన్ రైలు ద్వారా అరటితోపాటు ఇతర ఉద్యాన పంటలు ఢిల్లీకి పంపారు. ఆ తరువాత కిసాన్ రైలు ఆగిపోయింది. ప్రభుత్వంతో ఒప్పందం కుర్చుకున్న కంపెనీలు అరటి పంటను లారీల ద్వారా తరలించాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి 'బనానా రైలు' మొదలైంది. ఎస్‌కే బనానా కంపెనీ ద్వారా తాడిపత్రి రైల్వే స్టేషన్ నుంచి ముంబాయికి అరటిని పంపింది.

రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులు

బెళుగుప్ప, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 936 క్యూసెక్కులున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద హెచ్‌ఎన్ఎస్ఎస్ ఫేజ్-2కు 467 క్యూసెక్కులు వెళుతుండగా ప్రస్తుతం రిజర్వాయరులో 1.681 టీఎంసీల నీరు నిల్వ వుందని వెల్లడించారు.

న్యూస్ బాక్స్

మారుతున్న జీవనశైలితో కేన్సర్

● ఆర్ఎంఓ డాక్టర్ హేమలత

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బాల్యం నుంచి వృద్ధుల వరకు ప్రాణాంతకంగా మారిన కేన్సర్ వ్యాధికి మారుతున్న జీవనశైలి కారణమని చిన్నపిల్లల వైద్యనిపుణరాలు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ గుజ్జల హేమలత పేర్కొన్నారు. మంగళవారం క్యాన్సర్‌డే సందర్భంగా ఆర్ట్స్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐఎంఏ మహిళా విభాగం, రెడ్‌రిబ్బన్ క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సుకు డాక్టర్ హేమలత హాజరై మాట్లాడారు. ం ఈ వ్యాధిని మొదటిదశలోనే గుర్తించి తగిన వైద్యం అందించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్యాచరణ చేపట్టాయని తెలిపారు.

● నార్పల: మండలంలోని శిద్దరచెర్ల గ్రామంలో ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచు రామాంజనేయులు మాట్లాడుతూ రోగ లక్షణాలు గుర్తించిన వెంటనే వైద్యులను సంప్రదించి తగు జాగ్రత్తలు తీసుకొని ఆరోగ్యాన్ని సురక్షితంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, అమృతాంజలి, సచివాలయ సిబ్బంది శివయ్య, యామిని, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిపై అవగాహన కల్పించాలి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కుష్టు, క్షయ నివారణ జిల్లా అధికారి డాక్టర్ తిప్పయ్య సూచించారు. మండలంలోని ఎన్ఎస్‌గేటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవా రం ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఆశా డే సమావేశంలో ఆయన పాల్గొని సిబ్బందికి క్షయ, కుష్టు వ్యాధులపై అవగాహన కల్పించారు. మండల వైద్యాధికారి రవీనాయక్, సీహెచ్ఓ గోవిందమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, హెల్త్‌సూపర్‌వైజర్లు వెంకట నారాయణ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మల్టీ మీడియాపై అవగాహన



ముఖ్య వక్తను సత్కరిస్తున్న కళాశాల ఉద్యోగులు

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): 'డిజిటల్ యుగంలో మల్టీమీడియా' అనే అంశంపై స్థానిక పీవీకేకే ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల సివిల్ ఇంజనీరింగ్ విభాగం, కెరీర్ గైడెన్స్ సెల్ సంయుక్తం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. మాక్ అనంతపురం అనే సంస్థ ప్రతినిధి, పీవీకేకే ఐటీ పూర్వవిద్యార్థిని హర్షిత ముఖ్య వక్తగా హాజరయ్యారు. మల్టీ మీడియా ప్రాధాన్యం, డిజిటల్ టెక్నాలజీ విస్తరిస్తున్న విధానం, విద్యార్థులకు అందుబాటులో ఉన్న అవకాశాలు తదితర అంశాల గురించి వివరించారు. గ్రాఫిక్స్, యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్ వంటి రంగాల్లో ఉన్న అవకాశాలతో విద్యార్థులు మల్టీ మీడియా రంగంలో తమ భవిష్యత్తును ఎలా తీర్చిదిద్దుకోవచ్చో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు, కెరీర్ గైడెన్స్ సెల్ కోఆర్డినేటర్ వహీదా, రాము, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికకు దారి.. హర్షం

గార్లదిన్నె, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): శ్మశాన వాటిక దారి ఏర్పాటుతో 30 సంవత్సరాల ముస్లింల కల నెరవేరింది. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ముస్లింల శ్మశాన వాటికకు దారి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి ముసిం స్మశాన వాటికకు పోవాలంటే సుమారు కిలో మీటరు దూరం ఉంటుంది. దారి లేకపోవడంతో రైల్వే వారి స్థలంలో వెల్లేవారు. ముస్లిం శ్మశాన వాటికకు వెళ్లేందుకు అవసరమైన దారి కోసం సుమారు 17 మంది రైతులు వారి భూములలో స్థలం వదిలారు. దీంతో సర్పంచు ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ జగ్గాల రవి సహకారంతో 15వ ఆర్థిక సంఘం కేంద్రం నిధులతో దారి ఏర్పాటు చేశారు. ఆ దారిని మంగళవారం ప్రారంభించారు. దారి ఏర్పాటుకు సహకరించిన సర్పంచు ప్రశాంతిని, మాజీ ఎంపీటీసీ జగ్గాల రవిని, రైతులను ముస్లింలు ఘనంగా సన్మానించారు. దారి ఏర్పాటు చేయడంతో ముస్లీం సోదరులు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, ముస్లీంలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

అమళ్ళదిన్నెకు సతీ వియోగం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : అనంతకు చెందిన సీనియర్ సాహితీకారుడు అమళ్ళదిన్నె వెంకటరమణ ప్రసాద్‌కు సతీవియోగం కలిగింది. అమ్మళ్ళదిన్నె సతీమణి సుజాత(74) మంగళవారం ఉదయం 8.37 గంటల సమయంలో సోమనాథ్‌నగర్‌లోని వారి నివాసంలో తుదిశ్వాస విడిచారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె మంగళవారం బ్రెయిన్‌స్ట్రోక్‌తో మృతి చెందారు. సుజాత మృతి విషయం తెలుసుకుని జిల్లాకు చెందిన సాహితీకారులు అమళ్ళదిన్నె వెంకటరమణ ప్రసాద్‌ను కలిసి పరామర్శించడంతోపాటు వారి కుటుంబానికి సానుభూతిని వ్యక్తం చేశారు. కాగా సుజాత భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల శిక్షణ కోసం ప్రభుత్వ వైద్య కళాశాలకు అప్పగించారు.

దానిమ్మ తోటకు నిప్పు

శింగనమల, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వ్యక్తులు కొండకు నిప్పు పెట్టడంతో జూల్వాకాలువ గ్రామంలోని రైతు కుళ్ళాయప్పకు చెందిన 400 దానిమ్మ చెట్టు అగ్ని ఆహుతి అయ్యాయి. జూల్వాకాలువ సమీపం లోని ఎర్ర కొండ ప్రాంతంలో రైతు కుళ్లాయప్ప సర్వే నం. 303-4లోని 2.50 ఎకరాల్లో ఐదుఏళ్లగా 400పైగా దానిమ్మ చెట్టు సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంట కోత దశలో ఉంది. మంగళవారం ఉదయం ఎర్ర కొండకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కుళ్ళాయప్ప దానిమ్మ చెట్లకు మంటలు వ్యాపించాయి. దాదాపు 300 చెట్లకు పైగా కాలిపోయాయి. రైతు అగ్రిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. దీంతో రూ.2.50లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బాధిత రైతు కన్నీరు మున్నీరయ్యారు.

అనపతోటకు...

కనగానపల్లి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిళ్ళపల్లిలో మంగళవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని అనప తోట కాలిపోయింది. దీంతో రూ 2 లక్షలు నష్టం వాటిల్లినట్లు భాదిత రైతు నాగప్ప తెలిపాడు. తన పొలంలోని రెండెకరాల్లో అనపతోట సాగుచేశాడు. పంట సాగు నిమిత్తం దాదాపు రూ. లక్ష వరకూ పెట్టుబడి పెట్టాడు. ప్రమాదవశాత్తు మంటలు అనపతోటకు అంటుకుని పంట పూర్తిగా కాలిపోయింది. మంటలు అంటుకున్నాయని స్థానికులు, రైతులు తెలుపగా రైతు నాగప్ప అక్కడికి వచ్చి ఫైర్‌సిబ్బందికి ఫిర్యాదు చేశారు. ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి మంటలను ఇతర తోటలకు వ్యాపించ కుండా అదుపు చేశారు. అనపతోట అంటుకుని తీవ్రంగా నష్టపోయినట్లు బాధిత రైతు వాపోయాడు.



ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో యోగాసనాలు వేస్తున్న నగర ప్రజలు



సామూహిక సూర్య నమస్కారాలు

అనంతపురం కల్చరల్/క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విశ్వంలోని సర్వ మానవాళి మనుగడకు సూర్యభగవానుడే మూలాధారమని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ పేర్కొన్నారు. రథసప్తమిని పురస్కరించు కుని వివేకానంద యోగాకేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సామూహిక సూర్యనమస్కారాలను నిర్వహించా రు. అంతకుముందు సూర్యభగవానుడి చిత్రపటానికి పూజలు నిర్వహించా రు. వివేకానంద యోగాకేంద్ర జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి అధ్యక్షతన



యోగా సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ పద్మశ్రీ తదితరులు



నిర్వహించిన కార్యక్రమానికి ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మశ్రీ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. దాదాపు 300 మంది సామూహికంగా సూర్యనమస్కారాలు చేశారు. అనంతరం యోగా సర్టిఫికెట్ కోర్సు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ముఖ్యఅతిథుల చేతులమీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ అసోసియేట్ ఇంజనీర్ సుధాకర్, యోగాకేంద్ర కార్యవర్గ సభ్యులు దివాకర్, మారుతి ప్రసాద్, సుధాకరమూర్తి, పుల్లయ్య, తారక రామయ్య, గురురాజారావు, కటకం కృష్ణవేణి, అంజనేయులు, మల్లికార్జున, శ్రీనివాసరెడ్డి, రమణ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గోజుర్యూ క్రీడాకారులకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన గోజుర్యూ క్రీడాకారులు పతకాలు సాధించారు. మహిర షోటోకాన్ కరాటే డో ఇండియా ఆధ్వర్యంలో విశాఖపట్నంలోని రాజీవ్‌గాంధీ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించిన 8వ ఆల్‌స్టైల్ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీలకు ఇండియాతో పాటు శ్రీలంక, భూటాన్, మలేషియా, ఇంగ్లాండ్, నేపాల్, బంగ్లాదేశ్, నైజీరియా నుంచి సుమారు 1500మంది క్రీడాకారులు పాల్గొన్నారు. జిల్లాకు చెందిన గోజుర్యూ కరాటే అండ్ కబుడో స్కూల్‌కు చెందిన క్రీడాకారులు కటావిభాగంలో హాసినీరెడ్డి, జ్యోత్‌సాయి ప్రశాంత్, సుజన్, ప్రియదర్శిని బాబు, జస్వంత్, ప్రణతిలు స్వర్ణ పతకాలు సాధించారు. సాయి సిద్దార్థ్‌నాయక్, సాయింషా బాబాలు రజతపతకాలు సాధించగా , హిమబిందు, మానస కాంస్య పతకాలు సాధించారు. కుమిటే విభాగంలో హాసినీరెడ్డి, హిమబిందు, సాయిసిద్దార్థ్‌నాయక్‌లు బంగారు పతకాలు సాధించగా, జ్యోతిసాయి ప్రశాంత్, మానస, సాయింషాబాబాలు రజత పతకాలు సాధించారు. హాసినీరెడ్డి, హిమబిందు, సాయిసిద్దార్థనాయక్ కాంస్య పతకాలు సాధించారు. సినీనటులు సుమన్ విజేతలకు బహుమతులు అందజేసినట్లు కోచ్ మురళీకృష్ణారెడ్డి తెలిపారు.



అంతర్జాతీయస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన గోజుర్యూ క్రీడాకారులు

మృతి చెందిన టీచర్‌కు రూ.15లక్షల పరిహారం

అనంతపురం టౌన్, ఫిబ్రవరి4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల విధులకు వెళ్లి మరణించిన టీచర్‌కు ప్రభుత్వం పరిహారం మంజూరు చేసింది. జిల్లాలోని బొమ్మనహాళ్ మండలం చంద్రగిరి ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాదర రామాంజనేయులు 2014 ఎన్నికల విధులకు వెళ్లాడు. విధుల్లో ఉంటూ ఆ టీచర్ మృతి చెందాడు. దీంతో ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం ప్రభుత్వం ఆటీచర్ కుటుంబానికి రూ15లక్షలు ఎక్స్‌గ్రేషియాను మంజూరు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వులను మంగళవారం కలెక్టరుకు పంపారు.

భక్తిశ్రద్ధలతో రథసప్తమి



ఆర్ఎఫ్ రోడ్డులో సూర్యప్రభ వాహనంపై స్వామి ఊరేగింపు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రథసప్తమిని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి మూలవిరాట్‌తో పాటు నవగ్రహాలు, సూర్యభగవానుడికి వివిధరకాల అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన సూర్యప్రభ వాహనంలో వెంకటేశ్వర స్వామిని ఉంచి నగరోత్సవం నిర్వహించారు. హౌసింగ్‌బోర్డులోని వెంకటేశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలోనూ స్వామివారిని సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు. నగరోత్సవం ముందు ఓం సంగీత నృత్య కోలాట శిక్షణాలయం నాట్యాచార్యురాలు దేవరకొండ కౌసల్య నేతృత్వంలో మహిళలు, చిన్నారులు కోలాటమాడుతూ, సంప్రదాయ నృత్యాలతో స్వామివారికి నృత్యనీరాజనం పలికారు. అనంతరం ఆలయ కార్యవర్గం దేవరకొండ కౌసల్య బృందానికి జ్ఞా పిక అందజేసి సత్కరించారు. టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వ ర్యంలో ద్వారకానగర్‌లోని నారాయణ పాఠశాలలో రథసప్తమి వేడుకలను నిర్వహించారు. యోగా ఆవశ్యకతను వివరిం చడంతో పాటు విద్యార్థులచే యోగాసనాలు చేయించారు. అలాగే మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో నూ సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హౌసింగ్‌బోర్డులో కోలాటంలో పాల్గొన్న నాట్యాచార్యురాలు కౌసల్య బృందం

త్వరలోనే సూపర్ సిక్స్ అమలు

● చాపట్ల రోడ్డు ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పరిటాల సునీత



చాపట్ల తారురోడ్డు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా సూపర్ సిక్స్ పథకాలన్నీ త్వరలోనే నెరవేరుస్తామని ఎమ్మెల్యే పరిటాల సునీత తెలిపారు. మండలంలోని మరూరు జాతీయ రహదారి వద్ద నుంచి చాపట్ల వరకు రూ. 1.80 కోట్లతో నూతనంగా నిర్మించిన తారు రోడ్డును మంగళవారం ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. రోడ్డు ప్రారంభానికి హాజరైన ఎమ్మెల్యేకి పర్వతదేవరపల్లి వద్ద నుంచి టీడీపీ నాయకులు బైక్‌ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. జాతీయ రహదారి వద్ద నుంచి చాపట్ల వరకు ప్రచార రథంపై పూల వర్షం కురిపిస్తూ టపాసులతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ.. ఎన్నికల ప్రచారం సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తారురోడ్డు వేయించి గ్రామానికి వచ్చానన్నారు. టీడీపీ నాయకులు ఎల్ నారాయణచౌదరి, దర్మవరపు మురళి, నెట్టెం లక్ష్మీనారాయణ, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, మరూరు గోపాల్, మాజీ ఎంపీటీసీ లక్ష్మీదేవి, గంగలకుంట రమణ, కేశవ, మేనక తదితరులు పాల్గొన్నారు.

'వేల గొంతులు, లక్షల డప్పులుగా కదలిరండి'

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఎమార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 7న హైదరాబాద్‌లో 'లక్ష డప్పులు - వేల గొంతులు' పేరు నిర్వహించే భారీ సాంస్కృతిక ప్రదర్శనకు మాదిగ వర్గాలు వేల గొంతుకలై లక్షలాది డప్పులుగా కదిలి రావాలని ఎంఈఎఫ్ నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక ఉపాధ్యాయ భవన్‌లో ఆ సంఘం జాతీయ అదనపు ప్రధానకార్యదర్శి బండారు శంకర్ ఆధ్వర్యంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని 2024 ఆగష్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు మేరకు తెలంగాణా కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇందుకు సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలన్నారు. ఏపీలో సైతం అమలు చేయాలని సీఎం చంద్రబాబునాయుడును కోరుతున్నామన్నారు. దీని కోసం ఏపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్యకమిషన్ వెంటనే ప్రభుత్వానికి తన నివేదికను అందజేయాలని కోరారు.

ప్రమాదాలను నివారించాలి : ఆర్ఎం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): బస్సును నడిపేటపుడు డ్రైవర్లు అప్రమత్తంగా ఉండటంతో పాటు వేగ నియంత్రణ, ట్రాఫిక్ రద్దీ వంటి సమయాల్లో సమయస్ఫూర్తి పాటించాలని ఆర్టీసీ రీజనల్ మేనేజర్ సుమంత్ ఆర్ ఆదోని పేర్కొన్నారు. తద్వారా ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని సూచించారు. ఆర్ఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం ఆర్టీసీ డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన మెలకువలపై సూచనలు చేశారు. డ్రైవర్లకు ఆర్ఎం చేతులమీదుగా శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. డిప్యూటీ సీటీఎం శ్రీలక్ష్మి, తాడిపత్రి డీఎం శంకర్, ఏయంయఫ్ జయచంద్ర, వివిధ డిపోల సేఫ్టీ, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన న్యాయాధికారికి సన్మానం



న్యాయాధికారిని సన్మానిస్తున్న దృశ్యం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ పదోన్నతి పొంది బదిలీపై వెళ్తున్న న్యాయాధికారి శంకర్‌రావును ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అసోసియేషన్ కార్యాలయంలో న్యాయాధికారికి సన్మానం చేశారు. జిల్లా కోర్టు న్యాయాధికార్రి శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ఇతర న్యాయాధికారులు పాల్గొన్నారు. జిల్లా సీనియర్ సివిల్ జడ్జిగా ఉన్న శంకర్‌రావును తూర్పుగోదావరి జిల్లా రామచంద్రాపురం అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి కల్పిస్తూ బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గురుప్రసాద్, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్, బార్ అసోసియేషన్ కౌన్సిల్ సభ్యులు రామిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

'మాజీ ఎమ్మెల్యే అనుచరుల దాడి దుర్మార్గం'

అనంతపురం విద్య, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): తోపుదుర్తి గ్రామ సర్పంచ్ కొడుకు చిట్రా ఓబులేసుపై రాప్తాడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అనుచరుల దాడి దుర్మార్గమని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బండి పరశురాం పేర్కొన్నారు. మంగళవారం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందున్న ఓబులేసును ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా పరశురాం మాట్లాడుతూ.... ఆదివారం ఉదయం 11 గంటలకు చిట్రా ఓబులేసుపై అదే గ్రామానికి చెందిన ప్రకాష్‌రెడ్డి అనుచరులు ఇష్టానుసారంగా దాడి చేశారన్నారు. ఇంకోసారి పరిటాల శ్రీరాంను కలసినా, ఆయన పేరు ఎత్తినా... చంపుతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన తెలిపారు.

శివపార్వతుల కల్యాణోత్సవం



శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మాఘశుద్ధ సప్తమిని పురస్కరించుకుని హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథస్వామి దేవాలయంలో మంగళవారం శివపార్వతుల కల్యా ణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయ ఆవరణలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ కల్యాణోత్సవం నిర్వహించారు. అనంతరం రుద్రహోమం చేశారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు తీర్థప్రసాద, అన్నదాన వినియోగం చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మఠం బసవరాజు, విజయ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి ఐదుగురి సస్పెన్షన్

అనంతపురం క్రైం ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన ఐదుగురు నాయకులను ఆ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తాడేపల్లి పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి మంగళవారం ప్రెస్‌నోట్ విడుదల చేశారు. రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లికి చెందిన భూమిరెడ్డి మహానందరెడ్డి, అనంతపురం రూరల్ మండలం పూలకుంటకు చెందిన మద్దిరెడ్డి శివారెడ్డి, కళ్యాణదుర్గం మండలం ముద్దినేనిపల్లికి చెందిన బోయ నరేంద్ర (రాజారామ్), రామగిరి మండలం కుంటిమద్దికి చెందిన పొట్టే రమేష్, రామగిరి మండలం నసనకోటకు చెందిన కురుబ ముత్యాలును సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పార్టీ క్రమశిక్షణా కమిటీ సిఫారస్సుల మేరకు పార్టీ అధ్యక్షులు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రెస్‌నోట్‌లో తెలిపారు.

అనంత రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం : కలెక్టర్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : రక్తదానంతో పాటు సామాజిక సేవలు అందించడంలోను రాష్ట్రంలోనే అనంత రెడ్‌క్రాస్ సం స్థ మొదటిస్థానంలో ఉండడం అభినందనీ యమని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. ఆపిల్‌ఐకేర్ ఆస్పత్రి అధినేత జగన్ మోహన్ తన తండ్రి కుళ్లాయప్ప పేరుతో రెడ్‌క్రాస్‌లో కార్నియా కలెక్షన్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన వసతుల కల్పనకు ఆర్థిక సాయం అందించారు. ఆ సెంటర్‌ను మంగళవారం కలెక్టర్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇక్కడ ఈ సెంటర్‌ను ఏర్పాటుచేయడంవల్ల దాతలనుంచి కంటికార్నియాలు సేకరించి మరొకరికి కంటిచూపు కల్పించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మరో ఏడాదిలో ఇక్కడే ఐబ్యాంకు ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. రెడ్‌క్రాస్‌కు వచ్చిన ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ కాపు భారతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, ఆర్ఎంఓ డాక్టర్ హేమలత, డాక్టర్ షైదన్న, డాక్టర్ అక్బర్ సాహెబ్‌తదితరులు పాల్గొన్నారు.

అర్చక సమాఖ్య నాయకుల నిరసన



నిరసన తెలుపుతున్న సమాఖ్య నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలపై జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్‌ను ప్రశ్నించిన అర్చకులపై పోలీసు కేసులు నమోదు చేయించడమేంటని ఉమ్మడి అనంతపురం జిల్లా అర్చక సమాఖ్య అధ్యక్షుడు అంజనేయులు ప్రశ్నించారు. అందుకు నిరసనగా సమాఖ్య నాయకులు మంగళవారం సహాయ కమిషనర్ కార్యాలయం కింద నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడు తూ... ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్చకులు సమస్యల పరిష్కా రాన్ని కోరుతూ జనవరి 22న ఉమ్మడి జిల్లా అర్చక సమాఖ్య నాయ కులు అనంతపురం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశా ల మేరకు దేవదాయశాఖ సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడుపై మంగళవారం చేపట్టాల్సిన విచారణ వాయిదా పడింది. కాగా విచారణ లో పాల్గొనేందుకు అనంతపురం వచ్చిన అర్చక సమాఖ్య నాయకుల ను, పాల్తూరులో బసవేశ్వరస్వామి ఆలయానికి సంబంధించిన స్థలవివాదం లో అర్చకులకు న్యాయం చేస్తామని సహాయ కమిషనర్ తన కార్యాలయానికి పిలిపించారన్నారు. అయితే ఆ అర్చకులు తమ కార్యాలయ సిబ్బందిని బెదిరించారంటూ తప్పుడు కేసులు నమోదు చేయించడం తగదన్నారు. ఆదిశేషనాయుడు అనంతపురంలో బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అర్చకులను వేధిస్తున్నారని విమర్శించారు. సమాఖ్య సభ్యులు శ్రీనివాసులు, తిరుపతయ్య, వీరాంజనేయులు, హనుమంతరాయుడు, చేతన్, ఉదయ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లా బాస్కెట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు గురువారం ఉదయం 8గంటలకు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరిలు తెలిపారు. 2009 జనవరి 1వతేదీ తరువాత జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కాకినాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ చాంపియన్ షిప్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, క్రీడా సామగ్రి, యూనిఫాం, ఆధార్‌కార్డులతో హాజ రుకావాలన్నారు. వివరాలకు సెల్ నం. 9393711324ను సంప్రదించాలని కోరారు.

భయం వీడితే గెలుపు తథ్యం

● విద్యార్థులకు బీసీ వెల్ఫేర్ డీడీ కుష్బూకొఠారీ బోధ



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న డీడీ

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి) : భయం వీడితే... అన్నింటిలో గెలుపు తథ్యమని బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారీ పదవ తరగతి విద్యార్థులకు బోధించారు. స్థానిక కేఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో మంగళవారం బీసీ హాస్టళ్లలోని పదో తరగతి విద్యార్థులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. డీడీ కుష్బుకొఠారీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కష్టపడి చదివితే పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే అవకాశం ఉందన్నారు. వసతిగృహాల్లో మెనూ, వసతి విషయంలో ఇబ్బందులుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులకు డీడీ తన నిధులతో అట్టలు, పెన్నులు పంపిణీ చేయగా, ఫిజికల్ సైన్స్ ఫోరం ఆనంద భాస్కర్‌రెడ్డి స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో ఏబీసీడబ్ల్యూఓ సుభాషిణి, బీసీ వార్డెన్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మస్తాన్, జిల్లా అధ్యక్షుడు మారుతీప్రసాద్, వార్డెన్లు రాగూర్, నాగరాజు, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, నారాయణ నాయక్, శాంతాజ్, అరుణ, శాంతమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వైభవంగా రథసప్తమి వేడుకలు



స్వామివారి ప్రాకారోత్సవాన్ని నిర్వహిస్తున్న భక్తులు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సూర్యభగవానుడి మూలవిరాట్టుకు అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. గరుడ, గజ, పెద్దశేషవాహనం, హనుమాద్, సూర్యప్రభ వాహనాల్లో వేంకటేశ్వరస్వామి శ్రీదేవి, భూదేవి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. మేళతాళాల మధ్య ఆలయప్రాంగణంలో ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రంగయ్య, ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, రమేష్‌రెడ్డి, కార్యదర్శి నారాయణస్వామి, కోశాదికారి గుండా సుధాకర్, ప్రసాద్‌కమిటీ చైర్మన్ జయంతి వెంకట్, సభ్యులు సుదర్శన్‌బాబు, వేల్పూరి రవి, భక్తులు పాల్గొన్నారు.



రథోత్సవం ముందు కోలాటం ఆడుతున్న విద్యార్థులు

పామిడి: పట్టణంలోని ఆలయాల్లో రథసప్తమి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. అనంత గజ గరుడ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారి ఉత్సవ విగ్రహానికి రథోత్సవం నిర్వహించారు. సరస్వతీ విద్యా మందిరం నిట్టూరు నిలయం విద్యార్థులు కోలాటం ఆడడం ఎంతగానో ఆకట్టుకుంది.

ఘనంగా సుంకులమ్మ రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న విప్ కాలవ

కణేకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్యం గ్రామంలో మంగళవారం సుంకులమ్మ రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక హెచ్చెల్సీ కాలువపై వెలసిన అమ్మవారి ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంలో అలంకరించారు. అనంతరం గ్రామపురవీధులలో ఊరేగింపు నిర్వహించారు. ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కార్యక్రమానికి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్థులు సత్యనారాయణ, ప్రభాకర్, యువరాజ్‌గౌడ్, కురుబ నరేష్, శరభనగౌడ్ పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి..



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

గుమ్మఘట్ట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూలకుంట, రంగసముద్రం గ్రామాలలో మంగళవారం ఆంజనేయస్వామి రథోత్సవాలు వైభవంగా నిర్వహించారు. రథసప్తమి వేడుకల సందర్భంగా ప్రతి యేటా రథోత్సవాలు ప్రజలు నిర్వహిస్తారు. ఆలయాలను ముస్తాబు చేసి స్వామివారికి ప్రత్యేక ఆకుపూజ నిర్వహించి రథోత్సవాలను పురవీధుల్లో ఊరేగించారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తనయుడు కాలవ భరత్, క్లస్టర్ ఇన్‌చార్జి కాలవ సన్నన్న, సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

భూసేకరణలో రైతులకు న్యాయం చేయాలి



ఆర్డీవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గుంతకల్లు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రైల్వే లైన్ కోసం చేపట్టే భూముల సేకరణలో తగిన ధరను చెల్లించి తమకు న్యాయం చేయాలని కోరుతూ రైతులు డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్దకు వచ్చిన కసాపురం, గుంతకల్లు, నంచెర్ల, తదితర గ్రామాల రైతులు ఆందోళన నిర్వహించారు. రైతులు పూల రమణ, వరదరాజులు, ప్రభాకర్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలవ కింద పంటలు పండిస్తున్న తమకు ఎకరా రూ.30 లక్షల పరిహారాన్ని ఇచ్చేలా రెవెన్యూ అధికారులు రైల్వే అధికారులను ఒప్పించాలన్నారు.

ఘనంగా వందేళ్ల ఉత్సవాలు

గుత్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రైల్వే విద్యుదీకరణ జరిగి వందేళ్లు అయిన సందర్భంగా వేడుకలను స్థానిక రైల్వే డీజిల్ షెడ్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక డీజిల్ షెడ్‌నుంచి ఉద్యోగులు రైల్వే ఆసుపత్రి వరకు ర్యాలీ చేపట్టారు. డీజిల్ షెడ్ సీనియర్ డీఎంఈ ప్రమోద్ మాట్లాడుతూ 1925 ఫిబ్రవరి 3న విద్యుత్ ఇంజన్‌ను ప్రారంభించారన్నారు. నాడు 16 కి.మీతో ప్రారంభమై నేడు దేశ వ్యాప్తంగా విద్యుదీకరణ ప్రయాణం సాగుతోందన్నారు. ఏడీఎంఈ అశోక్‌గౌడ్, సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుంకన్న, మనోజ్, ప్రభుదాస్, విజయానంద్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం పరిశీలన

పెద్దపప్పూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముచ్చుకోట గ్రామంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయాన్ని జర్మనీ టీం, కేఎఫ్ డబ్ల్యూ ఆర్గనైజేషన్ సభ్యులు పరిశీలించారు. గ్రామంలో సాగుచేస్తున్న అరటి, చీనీ, శనగ, చామంతి పంటలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయం వాటివల్ల కలిగే లాభాలు వివరించారు. డీపీఎం లక్ష్మానాయక్, జియో ఏపీఎల్ అకాడమీ సిబ్బంది, ఏపీఎం శివకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



పంటలను పరిశీలిస్తున్న జర్మనీ బృందం

పంచాయతీలకు పండగే..!

- విడుదలైన ఆర్థిక సంఘం నిధులు
- గత ప్రభుత్వంలో నిధులు దారి మళ్లించిన వైనం
- సక్రమంగా వినియోగిస్తే పంచాయతీలకు మహర్దశ

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో నిర్వీర్యమైన గ్రామ పంచాయతీలు కూటమి ప్రభుత్వం చొరవతో మళ్లీ జీవం పోసుకుంటున్నాయి. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడంతో ఆర్థిక పరిపుష్టిని సంతరించు కోనున్నాయి. మండలంలో 19 గ్రామపంచాయతీలు ఉన్నాయి. 2021 ఫిబ్రవరి నెలలో ఎన్నికలు జరిగాయి. సర్పంచులు కొలువుదీరిన తరువాత అప్పట్లో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం పంచాయతీలను పట్టించుకోలేదు. సర్పంచులను ఉత్సవ విగ్రహాల్లా మార్చి నిధుల లేమితో ఒక్క పని చేయకుండా గాలికి వదిలేసింది. సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి సర్పంచులను కీలుబొమ్మలుగా మార్చారు. కేంద్రం కేటాయించిన ఆర్థిక సంఘం నిధులను అప్పటి ప్రభుత్వం దారి మళ్లించింది. దీంతో పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడాయి. కూటమి ప్రభుత్వం తొలి విడతగా 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేసింది.



పంచాయతీల వారిగా నిధులు ఇలా..

బండూరు గ్రామానికి రూ.1,117,755, బొల్లనగుడ్డం రూ.8,65,241, బొమ్మనహాళ్ రూ.1,46,001, దర్గాహోన్నూరు రూ.1,621,780, ఎల్లాంజి రూ.3,32,123 గోనేహాళ్ రూ.4,73,456 గోవిందవాడ రూ.22,14,524, హరేసముద్రం, రూ.7,43,629, కలుహోళ్ల రూ.3,33,121 కోళగానహళ్లి రూ.30,970 కురువళ్లి రూ.8,35,018 లింగదహాళ్ రూ.516,340, నేమకల్లు 10,34,636 సిద్ధరాంపురం రూ.3,60,294 సింగానహళ్లి రూ.8,98,981 శ్రీధరఘట్ట రూ.14,04,993 ఉద్ధేహాళ్ రూ.10,51,249 ఉంతకల్లు రూ.13,94,459 ఉప్పరహాళ్ రూ.6,40,579 నిధులు గ్రామ పంచాయతీ ఖాతాలో జమ కావడంతో సర్పంచులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అభివృద్ధి వైపు అడుగులు వేస్తాం



ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పంచాయతీల అభిద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు గడవకముందే పంచాయతీలకు నిధులు విడుదల చేయడం సంతోషదాయకం. గ్రామాల్లోని ప్రధాన సమస్యల పరిషారానికి ఈ నగదు దోహదపడుతుంది.

-కురుబ వన్నమ్మ, సర్పంచు, బొమ్మనహాళ్

నిధులు సక్రమంగా వినియోగించాలి



పంచాయతీలకు ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సక్రమంగా వినియోగించుకునేలా చూస్తాం. ప్రధాన సమస్యల పరిష్కారానికి నిధులను వాడుకోవాలి. తాగునీటి సమస్యలు లేకుండా చూస్తాం. ప్రతి రూపాయి గ్రామాల అభివృద్ధికి వినియోగించాలి.

- దాస్, ఈఓపీఆర్డీ, బొమ్మనహాళ్

రోడ్డు నిబంధనలు పాటించాలి: డీటీసీ



మాట్లాడుతున్న డీటీసీ వీర్రాజు

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు, డ్రైవర్లు తప్పనిసరిగా రోడ్డు నిబంధనలను పాటించి ప్రమాద రహిత పట్టణంగా తీర్చిదిద్దాలని డీటీసీ వీర్రాజు కోరారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని మంగళవారం స్థానిక ఎంవీఐ కార్యాలయంలో ఉచిత కంటి, గుండె మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు ఎవరైనా బాధితుడిని సమీపంలో ఆసుపత్రికి తీసుకెళ్లి రక్షిస్తే గుడ్ సమ్మైండెడ్ చట్టం ద్వారా ఫస్ట్ అవర్‌లో ప్రభుత్వం వారికి రూ.5వేలు పారితోషికం ఇస్తుందన్నారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చితే వారు ఇచ్చే దీవెనలు డ్రైవర్లకు శ్రీరామ రక్ష అన్నారు. అనంతరం నంద్యాల శాంతిరాం ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి, గుండెవైద్య శిబిరాలను ఆయన ప్రారంభించారు. 80 మంది డ్రైవర్లకు పరీక్షలు నిర్వహించారు. ఎంవీఐ రాజబాబు, టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్, డాక్టర్ సురేష్‌బాబు, లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి కృష్ణానాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కేన్సర్‌పై అవగాహన ర్యాలీ

గుత్తి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన ర్యాలీని మంగళవారం నిర్వహించారు. గాంధీ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. కళాశాల ఎండీ రఘునాథ్‌రెడ్డి, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు పరమేశ్వర్, అమర్నాథ్ మాట్లాడుతూ.. కేన్సర్ ప్రాణంతకమైన వ్యాధి అయినా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చన్నారు. సుధాకర్, ఏఈ ఇంతియాజ్‌బాషా, నరసింహులు, జోహెల్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి

కూడేరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువులు అర్థమయ్యే విధంగా బోధించాలని టిచ్‌టూల్ జిల్లా కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ సూచించారు. టిచ్‌టూల్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కూడేరులోని ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువులు అర్థమయ్యే విధంగా చెప్పాలన్నారు.

ఎక్సైజ్ అధికారుల విచారణ

పుట్లూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామంలో ఉన్న వైన్‌షాపు వద్ద ఎక్సైజ్ అధికారులు టెట్రా ప్యాకెట్లపై మంగళవారం విచారణ చేసినట్లు సమాచారం. జాతీయ రహదారి 544డి పక్కనే ఓ వైన్‌షాపు వద్ద అరటికూలీలతో సమాచారం సేకరించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులకు ఫోన్‌చేయగా స్పందించలేదు.

'అరాచకాలు సృష్టించే సంస్కృతి వైసీపీ వారిదే'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పెద్దవడుగూరు, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని అరాచకాలను సృష్టించే సంస్కృతి వైసీపీ వారికే చెందుతుందని తెలుగు యువత నియోజకవర్గ కార్యదర్శి దివాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీలో చురుగ్గా వ్యవహరించే టీడీపీ నాయకులు, మహిళలపై కార్యకర్తలపై ప్రబోదానంద కేసులు నమోదు చేసి జైలుకు పంపించిన ఘనత మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికే దక్కుతుందన్నారు. పోలీసు వ్యవస్థపై విమర్శలు మానుకొని ఆత్మవిమర్శ చేసుకొని వ్యవహరిస్తే ప్రజలు ఆదరిస్తారే తప్ప ఫ్యాక్షన్ సంస్కృతిని ప్రోత్సహిస్తే ప్రజలు తిరస్కరిస్తారన్నారు. ఇప్పటికైనా తమ పద్ధతులు మార్చుకోకపోతే ప్రజలు మర్చిపోయే పరిస్థితి ఉంటుందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, గంగరాజుయాదవ్, హరినాథ్‌రెడ్డి, చిరంజీవులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి ఇంటి నుంచి పారిశుధ్య కార్మికులు చెత్తను తీసుకెళ్లేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్‌అహ్మద్‌కు మంగళవారం సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. డివిజన్ కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ పది రోజులుగా ఇంటి నుంచి చెత్తను సేకరించడం లేదన్నారు. ప్రజలు ఇళ్లలో సంచుల్లో పెట్టుకోవడం వల్ల బ్యాక్టీరియా ఎక్కువై అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రఘునాథ్‌రెడ్డి, నారాయణ, విశ్వనాథ్, గోపి, బాషా, పాల్గొన్నారు.

అమ్మాయి చదువు.. అభివృద్ధికి అడుగు..

కుందుర్పి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిల చదువు... వారి అభివృద్ధికి అడుగులని మండల విద్యాధికారి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని నిజవళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓ, సూపర్ వైజర్ హాజరయ్యారు. ఆర్డీటీ టీం లీడర్ ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు సుధాకుమార్ రావు, హెడ్ కానిస్టేబుల్ అక్కులన్న, వైద్యసిబ్బంది లైలా, మహిళా పోలీసు స్వప్న, అంగన్‌వాడీ కార్యక్తలు పాల్గొన్నారు.

మొగుడు గారు..!



సమావేశంలో ఎంపీటీసీకి బదులుగా మాట్లాడుతున్న ఆమె భర్త

ఉరవకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు స్త్రీశక్తి భవనంలో మంగళవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి మహిళా సభ్యులకు బదులుగా వారి భర్తలు హాజరయ్యారు. సమస్యలపై అధి కారులను ప్రశ్నించారు. ఎంపీపీ దేవి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశా నికి ఎన్ఎన్‌పీ తండా, వెంకటాంపల్లి సర్పంచులకు బదులుగా వారి భర్తలు హాజరయ్యారు. గూళ్యపాళ్యం ఎంపీటీసీతోపాటు ఆమె భర్త సమావేశానికి వచ్చారు.



సర్పంచుల స్థానంలో హాజరైన భర్తలు

నిందితులను అరెస్ట్ చేయాలి

గుత్తి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై హత్యాచారం చేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్పీ, సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సర్కిల్ వద్ద నిరసన కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో వృద్ధురాలు, అయోధ్యలో దళిత యువతిపై జరిగిన హత్యాచార ఘటనలను ఖండిస్తూ నిరసన చేపట్టామన్నారు. నాగభూషణం, శ్రీనివాసరాజు, విజయ్,కొండయ్య, రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- ఇద్దరికి గాయాలు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): పూజా సామగ్రికి వచ్చి తిరిగి వెళుతుండగా జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన శివమాల భక్తులు గొల్ల మంజునాథ (22), చిత్రలింగ, సి.మంజునాథ పూజా సామగ్రి కోసం మంగళవారం రాయదుర్గం వచ్చారు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంలో తిరిగి వెళుతుండగా ఆర్టీఓ కార్యాలయం వద్ద వెనుక వైపు నుంచి ట్రాక్టర్ బలంగా ఢీ కొనడంతో గొల్ల మంజునాథ్ మృతి చెందాడు. మరో ఇద్దరు మంజునాథ, చిత్రలింగ అనే వ్యక్తులు గాయాలతో బయటపడ్డారు. గాయపడ్డ వారిని స్థానికులు రాయదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స అందించేలోపు మంజునాథ్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సీఐ జయానాయక్ సంఘటన స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను, ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నారు. రాజన్న, ఈరమ్మ దంపతుల ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబసభ్యులు శోకసముద్రంలో మునిగిపోయారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సర్వసభ్య సమావేశం గందరగోళం

- కోరం లేదంటూ వైసీపీ రాద్ధాంతం
- సభ్యుల హాజరుతోనే నిర్వహించాం: ఎంపీడీఓ

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): కోరం లేకుండా సర్వసభ్య సమావేశం ఎలా నిర్వహిస్తారని వైసీపీ ఎంపీటీసీలు అరుణ్, రాజు.. అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీఓ కొండయ్య కలుగజేసుకుని సమావేశాన్ని నిర్వహించేందుకు నలుగురు సభ్యులు అవసరం కాగా.. జుంజురంపల్లి ఎంపీటీసీ సురేష్, 74 ఉడేగోళం ఎంపీటీసీ లక్ష్మీతోపాటు వేపరాల ఎంపీటీసీ, ఆవులదట్ల ఎంపీటీసీ హాజరుకావడంతో సమావేశాన్ని నిర్వహించామని సమాధానం ఇచ్చారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ విద్యావతి ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. 11.30 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 12.30 గంటలకు ప్రారంభమైంది. అనంతరం ఆయా శాఖల వారీగా తమ ప్రగతి నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో ఏఓ మహేంద్ర, ఎంఈఓ వెంకటరమేష్, పీఆర్ జేఈ మునిస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ హరినాయక్, వెలుగు ఏసీ గోవిందప్ప, ట్రాన్స్‌కో ఏఈ బాలచంద్ర, ఇన్‌చార్జ్ ఏపీఓ భారతి, పీహెచ్‌సీ వైద్యులు మాధవమోహన్‌కుమార్, సర్పంచులు వన్నూరుస్వామి, మల్లేశప్ప, వన్నూరుస్వామి, విశ్వనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.



హాజరుపట్టికను చూపిస్తున్న ఎంపీడీఓ కొండయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

మెరుగైన వైద్యసేవలు అందించాలి: విప్

రాయదుర్గం, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తూ సంతృప్తి పరిచేలా చూడటం గురుతర బాధ్యతని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. ప్రాంతీయ వైద్యశాల అభివృద్ధి సలహా మండలి తొలి సమావేశం మంగళవారం ఆసుపత్రిలో నిర్వహించారు. కమిటీ చైర్మన్ హోదాలో కాలవ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి పేదల ఎక్కువగా వైద్యసేవల కోసం వస్తుంటారన్నారు. ఏ చిన్న సేవలు అవసరమైనా బళ్లారి, అనంతపురం వెళ్లే అవసరం రాకుండా వైద్యసేవల విస్తరణకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నానన్నారు. 22 మంది వైద్యులు పని చేయాల్సి ఉండగా పూర్తిస్థాయి వైద్యసిబ్బందిని నియమించుకోగలిగితే అన్ని రకాల వైద్యసేవలు అందించేందుకు వీలుంటుందన్నారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, వైద్యశాఖ ఉన్నతాధికారులతో ఇది వరకే చర్చించానన్నారు. త్వరలో భర్తీ చేయనున్న వైద్యపోస్టుల్లో ఈ ఆసుపత్రికి పూర్తిస్థాయి సిబ్బందిని నియమించాలని కోరామన్నారు. ఆసుపత్రి అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టానన్నారు. అభివృద్ధి సలహా మండల సభ్యులు తరచూ ఆసుపత్రికి వస్తూ వైద్య సేవలపై ఆరా తీస్తుండాలని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి నూతన సలహా మండల సభ్యులచే చైర్మన్ కాలవ ప్రమాణ స్వీకారం చేయించారు. వైద్యాధికారి జ్ఞానసుధ, కమిటీ సభ్యులు సురేష్, కళ్యాణ్, శ్రీనివాస్, సంపత్‌కుమారి పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరిద్దాం

- మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



తాడిపత్రి, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): ఆలయాలు, మసీదులు, చర్చిల అభివృద్ధికి అందరూ సహాయ సహకారాలు అందించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక నివాసంలో ఆయన మాట్లాడుతూ.. యాడికిలో చెన్నకేశవస్వామి ఉత్సవాలకు పెద్దఎత్తున చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 13న యాడికి ప్రజలు చెన్నకేశవస్వామి గురించి తెలిసిన పెద్దలు వాటికి సంబంధించి భూములు, స్థలాలు వివరాలు తెలిసిన వారు ఉంటే అక్కడికి వచ్చి వివరాలు చెప్పాలని, ఆలయ వివరాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు. ప్రస్తుతం తాడిపత్రి నియోజకవర్గంలోని ఆలయాలు, చర్చిలు, మసీదుల అభివృద్ధికి ముందు ఉన్నామన్నారు. ప్రస్తుతం బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వెంకటరమణ స్వామి దాదాపు 600సంవత్సరాల క్రితం స్థాపించిన దేవాలయాలు పడిపోయే పరిస్థితిలో ఉన్నందున ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి చొరవచూపి కేంద్ర ప్రభుత్వంలోని ఆర్కియాలజీశాఖ అధికారులతో మాట్లాడి వారిని ఒప్పించి ఆలయాలు అభివృద్ధికి బాటలు వేశామన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

తాడిపత్రి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆశావర్కర్ల సమస్యలను తీర్చాలని సీఐటీయూ నాయకులు రామాంజనేయులు, ఉమాగౌడ్ కోరారు. పట్టణంలోని దినసరి కూరగాయల మార్కెట్ ఎదురుగా ఉన్న ఆసుపత్రి వద్ద వారు మాట్లాడుతూ ప్రతి వెయ్యిమంది జనాభాకు ఒక ఆశా కార్యకర్త ఉండాల్సి ఉందన్నారు. కానీ నిబంధనలు పాటించకుండా 3వేల నుంచి 5వేల జనాభాకు ఒకరిని నియమించి వారిపై పనిభారం మోపుతున్నారన్నారు.

కందిచేను మేసి మూగజీవాల మృతి

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జుంజురంపల్లి గ్రామంలో కందిచేను మేసి ఆహారం అరగక 32 జీవాలు అస్వస్థతకు గురై అందులో ఏడు మేకలు, ఐదు గొర్రెలు మృతి చెందినట్లు పశువైద్యులు సూర్యనారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం జుంజురంపల్లి గ్రామంలో కందిచేను మేసి గొర్రెలు, మేకలు అస్వస్థతకు గురికావడంతో వైద్యులకు సమాచారం అందించారు. వైద్యులు అక్కడికి చేరుకుని పరిశీలించగా ప్రతిరోజూ కందిచేను మేయడంతోనే ఆహారం అరగకపోవడంతో మూగజీవాలు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చనిపోయిన వాటికి పోస్టుమార్టం నిర్వహించినట్లు తెలిపారు. మారెన్న నాలుగు, వన్నూరప్ప మూడు, రాజు నాలుగు, మారెన్న ఒకటి మృతి చెందాయి. రూ.లక్ష నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

మహిళ అరెస్టు

శెట్టూరు, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో చిట్టెమ్మ అనే మహిళ కర్ణాటక మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందుకున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించి ఆమెను అరెస్టు చేశారు. ఆమె నుంచి 110 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

ఉలవ పంట దగ్ధం



కాలిపోతున్న ఉలవ పంట

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 74 ఉడేగోళం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గురుసిద్ధప్ప సాగుచేసిన ఉలవ పంటకు మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దగ్ధమైంది. 20 ఎకరాలలో సాగుచేసిన ఉలవ పంటను కోతిగుట్ట సమీపంలోని కోసి రైతు నిలువ ఉంచాడు. మంగళవారం 11 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో 10 ట్రాక్టర్ల ఉలవ పంట దగ్ధమైనట్లు బాధితుడు తెలిపారు. రూ.5 లక్షలు నష్టం వాటిల్లినట్లు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

మొక్కజొన్న..

కణేకల్లు, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుంబిగనూరు గ్రామంలో విద్యుత్‌వైర్లు తెగపడి వీరన్నగౌడ్‌కు చెందిన రెండెక రాల మొక్కజొన్న పంట దగ్ధమైంది. పంట కాపునకు వచ్చే దశలో ప్రమాదశాత్తు విద్యుత్ వైర్లు తెగిపడటంతో పెట్టుబడి అంతా నష్టపోయినట్లు బాధితుడు వాపోయాడు. ప్రభుత్వమే తనకు ఆర్థిక సహాయాన్ని అందించాలని ఆయన కోరారు.